Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 154 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 జూన్ 2023 ఆదివారం పేజీలు : 4

## విపక్షాల ఐక్యత అసాధ్యం

జమ్మూ : బిహార్ రాజధాని పట్నా వేదికగా జరిగిన ప్రతిపక్షాల సమావేశంపై బీజేపీ అగ్ర నాయకత్వం విమర్శలు కురిపించింది. వారిది కేవలం ఓ ఫొటో సెషన్ మాత్రమేనని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. విపక్షాల ఐక్యత అసాధ్యమని.. వచ్చే ఎనికల్లో వారికి ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. ఈ సమావేశానికి ఎన్ని పార్టీలు వచ్చాయన్నది లెక్క కాదని, అవి ఏకాభిప్రాయానికి రావడం కష్టమని పేర్కొన్నారు. జమ్మూలో ఓ ర్యాలీలో షా మాట్లాడుతూ.. "మోదీ, నడ్డా, బీజేపీలను చాలెంజ్ చేస్తామంటూ ఓ చోట చేరిన వారికి ఒక్కటే చెప్పదల్చుకున్నా. మీ ఐక్యత అసాధ్యం. ఒకవేళ అదే సాధ్యమైతే 2024లో ఒక్కటిగా ప్రజల ముందుకురండి. మోదీ మరోసారి 300పైగా సీట్లతో అధికారంలోకి రావడం ఖాయం" అని అన్నారు.

# 'హస్తవాసి' కోసం

## ఎదురు చూపులు

## కాంగ్రెస్ తీర్థానికై క్యూకట్టేట్లున్నారే...!?




హైదరాబాద్ : తెలంగాణా కాంగ్రెస్ పరిస్థితి గడచిన రెండు మూడు నెలలుగా మారుతూ వస్తోంది. గతం కంటే కూడా పటిష్టం అయింది. దానికి నాయకులు జనంలోకి రావడమే. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఒక వైపు పాదయాత్ర చేస్తే మరో వైపు మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రతో జనాలను కలుస్తున్నారు. రాహుల్ భారత్ జోడో యాత్రకు మంచి రెస్పాన్స్ లభించింది. ఇపుడు చూస్తే ప్రియాంకా గాంధీ సరూర్ నగర్ సభకు జనాలు పోటెత్తారు. వచ్చే నెలలో సోనియా రాహుల్ ప్రియాంకా త్రయం తెలంగాణాకు రానున్నారు. ఇపుడు అన్నింటికీ మించి కర్నాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణా కాంగ్రెస్ కి వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చాయి. పొరుగున ఉన్న స్టేట్ లో కాంగ్రెస్ గెలవడం అది కూడా బంపర్ విక్టరీ కొట్టడంతో ఆ ప్రభావం కచ్చితంగా తెలంగాణా మీద ఉంటుంది అని అంటున్నారు. ఒక వైపు జనాల మూడ్ ని మార్చే గెలుపు ఇది. అదే టైం లో కష్టపడితే ఐక్యంగా ఉంటే తెలంగాణాలోనూ అధికారం మాదే అన్న ధీమాను కాంగ్రెస్ నాయకులకు కలుగచేసి మేలుకొలిపే విధంగా కర్నాటక తీర్పు వచ్చింది. ఈ తీర్పు మీద టీ కాంగ్రెస్ నేతలు అంతా ఫుల్ జోష్ తో మాట్లాడారు. మాజీ పీసీసీ చీఫ్ ఉత్తం కుమార్ రెడ్డి అయితే అంతా కలసి పనిచేస్తామని మంచి మాట చెప్పారు. రేవంత్ రెడ్డి తెలంగాణాలో అవే ఫలితాలు రిపీట్ అవుతాయని స్పష్టం చేశారు. ఇక మీదట కాంగ్రెస్ పెద్దల చూపు ఫోకస్ అంతా తెలంగాణా మీదనే ఉంటాయనడంలో సందేహం లేదు. తెలంగాణాలో బీజేపీ పాలపొంగు అంతా మునుగోడు ఉప ఎన్నిక నుంచే జారిపోవడం కనిపించింది. గడచిన అయిదారు నెలలుగా చూసుకుంటే బీజేపీ గ్రాఫ్ తగ్గుతోంది. అదే టైంలో కాంగ్రెస్ లో జోష్ కనిపిస్తోంది. ఎన్నికలు ఆరు నెలల దగ్గరలో ఉన్నాయనగా చూసుకుంటే పాలిటిక్స్ పోలరైజేషన్ కనిపిస్తోంది. ఇప్పటికి రెండు దఫాలుగా అధికారంలో ఉన్న బీయారెస్ మీద జనాలకు ఆగ్రహం ఉంది యాంటీ ఇంకెంబెన్సీ చాలా ఎక్కువగానే ఉంది. అయితే బీయారెస్ వ్యూహాత్మకంగా బీజేపీ మీద దాడిని పెంచి కాంగ్రెస్ ని ఏమీ కాకుండా చేస్తూ తెలంగాణాలో ట్రయాంగిల్ ఫైట్ కి రంగం సిద్ధం చేస్తోంది. కానీ బీజేపీ అనుకున్నంతగా పుంజుకోకపోవడమే కాదు గతంలో ఉన్న బలం ఆశలు అన్నీ కరిగిపోతునాయి. కర్నాటక దెబ్బతో బీజేపీ డీలా పడే పరిస్థితి ఏర్పడింది. ఇది కాంగ్రెస్ కి మంచి టానిక్ గానే పనిచేయబోతోంది. ఇక ట్రయాంగిల్ ఫైటింగ్ అని కర్నాటలో అనుకున్నా ఓటర్లు బాగా తెలివితో చైతన్యంతో ఓట్లేశారు. 37 సీట్లు తెచ్చుకుని ఏ పార్టీకి మెజారిటీ రాకుండా చేస్తూ హంగ్ అసెంబ్లీకి కారణం అవుతున్న జేడీఎస్ ని సగానికి కత్తిరించి పారేశారు. ఆ ఓట్లు అన్నీ కూడా కాంగ్రెస్ వైపు టర్న్ అయ్యాయి. అంటే జనాలు గెలిచే పార్టీ వైపే చూస్తారు అన్నది ఇక్కడ రుజువు అయింది. అలాగే తాము వద్దు అనుకుంటున్న ప్రభుత్వం దిగిపోవాలీ అంటే కచ్చితంగా ఓడించే సత్తా ఉన్న పార్టీకే జనాలు ఓట్లు గుద్దుతారు. ఇపుడు తెలంగాణాలో త్రిముఖ పోటీ జరుగుతుందని ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోయి మళ్లీ బీయారెస్ గెలుస్తుంది అని భావించ వారంతా కర్నాటక ఫలితాలు చూశి నాలుక కరచుకోవాల్సిన పరిస్థితి ఉంది. బీయారెస్ కి టఫ్ ఫైట్ ఇచ్చేది కాంగ్రెస్ అన్న మాట ఇపుడు రుజువు అవుతోంది. కాంగ్రెస్ బలం నానాటికీ పెరుగుతోంది. ఈ నేపధ్యంలో భారీ ఎత్తున చేరికలు కూడా కాంగ్రెస్ లో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మాజీ మంత్రి జూపల్లి క్రిష్ణారావు. అలాగే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి బిగ్ షాట్స్ ఇపుడు తమ మనసు మార్చుకుని హస్తం నీడకు చేరేందుకు రెడీ అవుతున్నారు అని ప్రచారం సాగుతోంది. వారే కాదు చాలా మంది కీలక నేతలు ఇంకా చెప్పాలీ అంటే అధికార బీయారెస్ లో ఉన్న నేతలు బీజేపీ అసమ్మతి నేతలు బీజేపీలో ఉంటూ కూడా వచ్చే ఎన్నికల ఫలితాలను ఊహించే వారు అంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారని అంటున్నారు. అదే కనుక నిజమైతే కాంగ్రెస్ గేట్లు బార్లా తెరచి ఉంచుకోవడం మంచిది అని అంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పాజిటివిటీ తెలంగాణా కాంగ్రెస్ కి కనిపిస్తున్న నేపధ్యంలో గెలుపు గుర్రం మీద పందెం కాసేందుకు చాలా మంది నేతలు ఇపుడు పోటీ పడుతున్నారు. రానున్న రోజుల్లో రాహుల్ సోనియా సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు నేతలంతా రెడీ అవుతున్నారని టాక్. మొత్తానికి తెలంగాణా రాజకీయం వేగంగా మారుతోంది. కాంగ్రెస్ కి మంచి రోజులు వస్తున్నాయి. తెలంగాణాను ఇచ్చిన పార్టీకి ఫస్ట్ టైం గెలిపించుకోవాలని జనాలు డిసైడ్ అయితే కనుక బీయారెస్ విపక్ష పాత్రకు పరిమితం కావడానికి సిద్ధపడాల్సిందే.

## 27న పండరిపూర్ దేవాలయాన్ని సందర్శించనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్ : మహారాష్ట్ర సోలాపూర్ జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయం పండరిపూర్‌లోని శ్రీ విఠల్ రుక్మిణీ మందిరాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 27న సందర్శించనున్నారు. ఈ పర్యటన అధికారికంగా ఇంకా ధ్రువీకరణ కాలేదు. సీఎంతో పాటు పలువురు



మంత్రివర్గ సహచరులు పండరిపూర్ వెళ్లనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సంత్ జ్ఞానేశ్వర్, సంత్ తుకారాం పల్లకీలకు సీఎం కేసీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని భారాస మహారాష్ట్ర ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా దోంఢ్గే తెలిపారు.

## తెలంగాణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు.. 2023లోనే ఎన్నికలు?

హైదరాబాద్ : తెలంగాణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు తెలంగాణకు చేరుకున్నారు. నేటి నుంచి మూడు రోజులు హైదరాబాద్‌లో మకాం వేయనున్నారు. నేడు తెలంగాణ ఎన్నికల కమిషనర్‌తో భేటీకానున్నారు. రేపు కలెక్టర్లు, ఎస్పీలతో, 27న చీఫ్ సెక్రటరీతో సమీక్ష నిర్వహించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం చేసే చర్యలు తీసుకోనున్నారు. తెలంగాణలో 2023లోనే ఎన్నికలు జరిగేలా ఈసీ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ సాధారణ ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలోనే వరుసగా అధికారులకు ట్రైనింగ్ ఇస్తూ వస్తోంది. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చింది. ఈనెల 5 నుంచి 10 వరకూ ఈసీ మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇచ్చింది. ఓటర్ల నమోదు మొదలు కొని పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకూ ఎన్నికల ప్రాసెస్‌పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇక మూడు సంవత్సరాలు ఒకే దగ్గర పని చేస్తున్న అధికారుల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వడంతో ఈ బదిలీల ప్రక్రియ కూడా ప్రారంభమైంది.



తహసీల్దార్ నుంచి కలెక్టర్ల వరకు, ఎంపీడీవో నుంచి జిల్లా పంచాయతీ అధికారుల వరకు, ఎస్ఐల నుంచి ఎస్పీల వరకు బదిలీలుంటాయనే చర్చ సాగుతోంది. జోనల్, మల్టీ జోనల్, స్టేట్ క్యాడర్ పోస్టుల వారీగా బదిలీలు చేపట్టనున్నారు. జులై 31 లోపు ఈ బదిలీల ప్రక్రియ పూర్తి కానుంది. ఇక నవంబర్‌లో షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2.99 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అలాగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. దీంతో ఓటర్ల సంఖ్య మరింత పెరగనున్నట్లు సమాచారం. కాగా.. నవంబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

# కాంగ్రెస్ బడా నేతలపై బీఆర్ఎస్ కన్ను!




## జానారెడ్డి, ఉత్తమ్ , జగ్గారెడ్డికి బీఆర్ఎస్ వల?

హైదరాబాద్ : కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో జోష్ మీద ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యూహం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను తగ్గించేందుకు ఓ కార్యాచరణ రూపొందించారని సమాచారం. వాస్తవానికి కర్ణాటక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు పుంజుకుంటోంది. పలువురు బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెసలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎసకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి రంగం సిద్ధమైంది. వీళ్లే కాకుండా పలువురు ఇతర నేతలు కూడా హస్తం పార్టీ వైపే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెసలో సీనియర్ నేతలుగా ఉన్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఆయన కుమారుడు రఘువీర్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై కేసీఆర్ దృష్టి పెట్టినట్లు తెలిసింది. వారిని కారు ఎక్కించగలిగితే.. కాంగ్రెసను వ్యూహాత్మకంగా దెబ్బకొట్టవచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ముఖ్య నేతలతో తాము అంతర్గతంగా చర్చల్లో ఉన్నామని, వారు త్వరలోనే తమ పార్టీలో చేరుతారని బీఆర్ఎస్ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌తో ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జగ్గారెడ్డి మొదటి నుంచి విభేదిస్తున్న విషయం తెలిసిందే. పలు సందర్భాల్లో బహిరంగంగానే వారు రేవంత్‌పై విమర్శలు గుప్పించారు. కొద్దినెలల కిందట సునీల్ కనుగోలు కార్యాలయంపై రాష్ట్ర పోలీసులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తనపై దుష్ప్రచారం చేసేందుకు జరుగుతున్న తతంగమంతా బహిర్గతమైందని ఉత్తమ్ ఆరోపించారు. రేవంత్ ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతోందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రేవంత్ ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ సోనియాకు ఉత్తమ్ లేఖ రాసినట్లు సమాచారం. తనలాంటి సీనియర్లను అవమానించేలా పార్టీలో సంఘటనలు జరుగుతుండడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. పార్టీలో కొనసాగాలా? వద్దా? అన్న రీతిలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు జానారెడ్డి కూడా రేవంత్ వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరందరినీ ఆకర్షించడం ద్వారా కోలుకోలేని విధంగా కాంగ్రెసను దెబ్బకొట్టవచ్చని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ మేరకు సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నారని, కాంగ్రెస్ పొంగును ఒక్కసారిగా చల్లార్చాలని యోచిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

**కాంగ్రెస్ అధిష్ఠానం ఆరా :** రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఆరా తీస్తోంది. కర్ణాటకలో విజయం తర్వాత... తెలంగాణపై ఆ పార్టీ నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు ఎప్పటికప్పుడు రాష్ట్రం నుంచి సమాచారం తెప్పించుకుంటోంది. ఈ నేపథ్యంలోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కూడా దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయొద్దని సూచించినట్లు సమాచారం. అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఆదేశించినట్లు తెలిసింది.

# సంపాదకీయం

## కేసీయార్ జాతీయ మంత్రాంగం..

## ఆయనకు పోటీగా...?

గులాబీ బాస్ జాతీయ ప్రెసిడెంట్ హోదాలో ఢిల్లీకి వెళ్లారు. మూడు రోజుల పాటు కేసీయార్ ఢిల్లీలో గడుపుతారు అని తెలుస్తోంది. ఢిల్లీలో ఆయన ఏం చేయబోతున్నారు అన్నదే చర్చగా ఉంది. కేసీయార్ కాంగ్రెస్ బీజేపీ వ్యతిరేక కూటమిని కట్టాలని చూస్తున్నారు. ఆ దిశగానే ఆయన ఆలోచనలు ఉన్నాయి. ఆయన 2019 నుంచి జాతీయ రాజకీయాల్లోకి రావాలని ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. గత ఏడాదిగా ఆయన తన దూకుడును పెంచారు. దేశంలోని విపక్ష నేతలను వరసబెట్టి కలసి వచ్చారు. గతంలో ఆయనను కలిసిన వారిలో యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ బీహార్ సీఎం నితీష్ కుమార్ డిప్యూటీ సీఈం తేజస్వి యాదవ్ కర్నాటక నుంచి మాజీ సీఎం కుమారస్వామి వంటి వారు ఉన్నారు. అయితే కేసీయార్ విపక్షాలను ఏకత్రాటి మీదకు తెచ్చి జాతీయ స్థాయిలో బీజేపీ కాంగ్రెస్ అన్నవి లేకుండా కొత్త కూటమిని ఏర్పాటు చేయాలని ఆశపడుతున్నారు. అక్కడే ఆయనకు విపక్ష నేతలతో విభేదాలు వస్తున్నాయని అంటున్నారు. కాంగ్రెస్ లేకుండా విపక్ష కూటమి తయారు కాదని ఇతర నాయకులు భావిస్తున్నారు. ఇక విపక్ష పార్టీలు ఏదో ఒక సందర్భంగాలో కాంగ్రెస్ కి మద్దతు ఇవ్వడమో మద్దతు తీసుకోవడమో చేస్తూ వచ్చాయి. నిన్నటి దాకా చూసుకుంటే కుమార స్వామి బీయారెస్ తో కలసి మెలసి ఉండేవారు. ఆయన ఇపుడు అసెంబ్లీ ఎన్నికల్లో బిజీగా ఉన్నారు. రేపటి రోజున తన పార్టీ జేడీఎస్ కింగ్ మేకర్ పాత్ర పోషించాలని ఆశిస్తున్నారు. అంటే కుదిరితే బీజేపీ లేకపోతే కాంగ్రెస్ లతో కలసి అయినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సీఎం కావాలని చూస్తున్నారు. దాంతో బీయారెస్ తో జేడీఎస్ దూరంగా ఉంటోంది అని అంటున్నారు. బీహార్ నుంచి జేడీయూ నేత తేజస్వి యాదవ్ కూడా ఇపుడు నితీష్ కుమార్ తో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. నితీష్ కుమార్ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వాన విపక్ష కూటమి కోసం కాళ్లగిరేలా తిరుగుతున్నారు. ఒక విధంగా కేసీయార్ పాత్రలోకి ఆయన లేట్ గా అయినా లేటెస్ట్ గా వచ్చేశారు అన్న మాట. ఇక నితీష్ కుమార్ ఇప్పటికే మమతా బెనర్జీతోనూ అరవింద్ కేజ్రీవాల్ తోనూ భేటీ అయి యాంటీ బీజేపీ ఫ్రంట్ దిశగా చర్చలు జరిపివచ్చారు. ఇవి ఫలించే విధంగా ఉన్నాయని అంటున్నారు. అలాగే యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ సహా ఇతర నేతలతో కూడా నితీష్ భేటీకి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కేసీయార్ హస్తిన టూర్ ఆసక్తిని పెంచుతోంది. కేసీయార్ ఢిల్లీలో మూడు రోజులు ఉండడం ద్వారా బీయారెస్ ని జాతీయ స్థాయిలో కీలకం చేయాలని చూస్తునారు. మరి ఆయనతో కలసి వచ్చే పార్టీలు ఏవి అన్నది చర్చగా ఉంది. అరవింద్ కేజ్రీవాల్ అయితే కాంగ్రెస్ బీజేపీ రెండింటినీ వ్యతిరేకిస్తున్నారు. అలనటి వారితో కేసీయార్ చర్చించే అవకాశం ఉంది. ఇంకో వైపు మహారాష్ట్ర రాజకీయాల్లో బీయారెస్ ని యాక్టివ్ చేయాలని కూడా కేసీయార్ చూస్తున్నారు. నిజానికి జాతీయ స్థాయిలో రాజకీయ శూన్యత విపక్ష శిబిరంలో అయితే ఉంది. దాన్ని భర్తీ చేసేందుకు సీనియర్ లీడర్లు ఎవరి మటుకు వారు ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో వారు తామే లీడ్ చేయాలని ఉబలాటపడడం వల్లనే చిక్కులు వస్తున్నాయి. ఇపుడు కేసీయార్ అయినా నితీష్ కుమార్ అయినా కేంద్రంలో కొత్త ప్రభుత్వంలో కీలకంగా ఉండాలనే చూస్తున్నారు. అదే సమయంలో నితీష్ కి ఉన్న అడ్వాంటేజ్ ఏంటి అంటే కాంగ్రెస్ తో కలసిపోవడం కేసీయార్ ఈ డిసెంబర్ లో తెలంగాణాలో ఎన్నికల తరువాత కాంగ్రెస్ ని కలుపుకుంటారా అపుడు కూడా దూరం పాటిస్తారా అన్న దాన్ని బట్టే ఆయన జాతీయ రాజకీయ మంత్రాంగం ఏంటి అన్నది ఆధారపడి ఉంటుంది అని అంటున్నారు.

# ఆనకట్టకు ప్రమాదం

వనపర్తి : ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని కృష్ణానదిపై తెలంగాణలో నిర్మించిన తొలి ప్రాజెక్టు జూరాల ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్ కం బ్యారేజీ పద్ధతిలో డ్యాం నిర్మాణం చేపట్టినప్పటికీ.. భారీ లోడ్‌లతో వెళ్తున్న వాహనాలతో కట్ట మన్నిక దెబ్బతినే అవకాశం ఉంది. ఈ మేరకు జలాశయాల భద్రత సమీక్ష కమిటీ తన అధ్యయన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. ఆనకట్టపై రాకపోకలను వెంటనే నిలిపేయకపోతే ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని బృందం పేర్కొంది. 2019లో వచ్చిన వరదల కారణంగా పూర్తి స్థాయి గేట్లు ఎత్తడంతో కట్ట దిగువ భాగంలో ఉన్న ప్యారాపెట్ వాల్ కూలిపోయింది. కట్టపై నుంచి గ్యాలరీ ప్రదేశం పూర్తిగా మట్టితో నిండిపోయింది. దీంతో కట్టకు ప్రమాదం పొంచి ఉందని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు వార్తా కథనాలు ప్రచురించింది. కొంతమేర మట్టితో స్వల్ప మరమ్మతులు చేశారు. అలాగే గ్యాలరీకి వెళ్లేందుకు లిఫ్టులు పని చేయడం లేదని కమిటీ తెలిపినప్పటికీ.. అక్కడ అసలు లిఫ్టులనే ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే జూరాల ప్రాజెక్టును పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు బృందావనం పార్కు, బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. గత సంవత్సరం మంత్రి కేటీఆర్ బృందావనం పార్కుకు శంకు స్థాపన కూడా చేశారు. కానీ ఇప్పటి వరకు అక్కడ ఎ లాంటి పనులు ప్రారంభించ లేదు. 1995లో అందుబాటులోకి వచ్చిన జూరాల ప్రాజెక్టు వద్ద నిర్వహణ పనులు మినహా ఇప్పటివరకు చెప్పుకోగదగ్గ మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పుడు డ్యామ్ రీహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టులో తెలంగాణ చేరడంతో మరమ్మతులు చేసే అవకాశం ఉంది.

భారీ వాహనాలతోనే ఇబ్బందులు..జూరాల ప్రాజెక్టు ఆనకట్ట రోడ్ కం బ్యారేజీ పద్ధతిలో నిర్మించినందున ఆనకట్టపై నుంచి వాహనాల రాక పోకలు సాగించవచ్చు. కానీ హెవీ లోడ్ వాహనాలు వెళ్లడానికి వీలు లేదు. అవి వెళ్తే కట్ట మన్నిక దెబ్బతినే ప్రమాదం ఉందని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే డ్యాం నిర్మిం చిన నాటి నుంచి ఇప్పటివరకు భారీ వాహ నాలు ప్రాజెక్టు మీదుగా వెళ్తూనే ఉన్నాయి. జలాశయాల భద్రత సమీక్ష కమిటీ కూడా తన నివేదికలో ఇదే విషయాన్ని పేర్కొంది. జాతీయ రహదారిపై నుంచి వెళ్తే దూరభారం కావడం వల్ల, గద్వాల జిల్లా మీదుగా నారాయణపేట, మక్తల్, దేవరకద్ర తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గాన్ని వాహనదారులు ఎంచుకుం టున్నారు. అయితే పబ్లిక్ ట్రాన్స్ ఫోర్ట్ వాహనాలతో పెద్దగా ఇబ్బంది లేక పోయినప్పటికీ, గూడ్స్ ట్రాన్స్‌ఫోర్ట్ వెహికిల్స్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా బియ్యం లారీలు, ఇసుక లారీలు కట్ట మీదుగా వెళ్తున్నాయి. ఈ మధ్యకాలంలో మక్తల్‌లో ఇసుక తవ్వకాలు జరుగుతుండటంతో గద్వాల ఇసుకాసురులు హెవీ లోడ్ టిప్పర్లను జూరాల మీదుగా గద్వాలకు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌లో కనీసం 21 నుంచి 25 క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలిస్తుండటంతో ఆ భారం కట్టపై అధికంగా పడుతోంది. ఒక్కో లారీలో టన్నుల కొద్ది బియ్యం తరలిస్తున్నారు. అలాగే గద్వాల నుంచి మక్తల్, నారాయణపేటకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలతో కట్టపై లోడ్ ఎక్కువగా పడుతోంది. మొదటి నుంచి హెవీ లోడ్ వాహనాలను కట్టపై నుంచి అనుమతించక పోయినట్లయితే ఇబ్బందులు ఉండేవి కావు. కానీ జూరాల అధికారుల నిర్లక్ష్యంతో ఈ రోజు కట్టకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి వచ్చింది. ప్రతిపాదనలతోనే సరి..రాష్ట్రంలోని చాలా ప్రాజెక్టుల ఆనకట్టలపై వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదు. కానీ కొన్ని ప్రాజెక్టులు ఎక్కువ ప్రాంతాలకు కనెక్టివిటీ సెంటర్లు కావడంతో రోడ్ కం బ్యారేజీ పద్ధతిలో కట్టల నిర్మాణాలు చేపట్టారు. అయితే ప్రాజెక్టుల దిగువన కచ్చితంగా బ్రిడ్జిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండగా, జూరాల దిగువన ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలు ఉన్నా నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. గతంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా, ఆ తర్వాత నేషనల్ హైవే ఆత్మకూరు నుంచి జూరాల గ్రామం మీదుగా గద్వాల మండలంలోని కొత్తపల్లిని కలిపేందుకు సర్వే జరిగింది. ఇందులో జూరాల గ్రామం కొత్తపల్లి మధ్యలో ఉన్న నదిపై బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రతిపాదించారు. అయితే ప్రతిపాదనల దశ దాటి మంజూరుకు నోచుకోవడం లేదు. ఫలితంగా అందరూ రోడ్ కం బ్యారేజీనే రవాణా మార్గంగా ఎంచుకుంటున్నారు. జలాశయాల భద్రత సమీక్ష కమిటీ కూడా జూరాలకు దిగువను బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సూచించింది. దిగువ భాగంలో బ్రిడ్జి ఏర్పాటు చేయడం వల్ల గద్వాల నుంచి ఆత్మకూరు, మక్తల్, అమరచింత, దేవరకద్ర, నారాయణపేట తదితర ప్రాంతాలకు రవాణా సులభం కానుంది. త్వరితగతిన బ్రిడ్జి ఏర్పాటు చేయకపోతే జూరాల మీదుగానే రాకపోకలు జరిగి, భవిష్యత్‌లో కట్ట ఉనికికి ప్రమాదం ఏర్పడటం ఖాయమనే అభిప్రాయం ఉంది. మరి డ్యామ్ రీహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు ద్వారానైనా పరిస్థితిలో మార్పు వస్తుందేమో వేచిచూడాలి.


# పోషకాహార లేమి శాపం



వనపర్తి :ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పిల్లల్లో పోషకాహార లోపం ప్రధాన సమస్యగా మారింది. సరైన పౌష్టికాహారం అందకపోవడం వల్ల వారిలో ఎదుగుదల రోజురోజుకూ క్షీణిస్తోంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు, ఇతర పథకాల ద్వారా పిల్లల పోషణకు బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నప్పటికీ, పరిస్థితిలో మార్పు రావడం లేదు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 నివేదిక ద్వారా కేంద్ర ప్రభుత్వం జిల్లాల్లో పోషకాహార లోపం ఏ స్థాయిలో ఉంది, దాని పర్యవసనాలు ఎలా ఉండబోతాయనే విషయాలను వెల్లడించింది. అందులో ప్రధానంగా ఎత్తు తక్కువగా ఉన్న జిల్లాలను తీసుకుంటే దేశంలో జోగుళాంబ గద్వాల జిల్లా నాలుగో స్థానంలో ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.పోషకాహార లోపంతో ఉమ్మడి జిల్లా వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా పిల్లల్లో ఎదుగుదల లోపించడంతో పాటు రక్తహీనత సమస్యల బారిన పడుతున్నారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 నివేదికలో ఈ విషయాలు వెలుగు చూశాయి. పోషకాహార లోపంతో పిల్లల్లో ఎదుగుదల లోపించిన జిల్లాల్లో మొదటి మూడు స్థానాల్లో ఉత్తరప్రదేశ్‌లోని సంబాల్ జిల్లా ప్రథమ, మేఘాలయ రాష్ట్రంలోని సౌత్‌వెస్ట్ కాశీ జిల్లా ద్వితీయ, గుజరాత్‌లోని పటాన్ జిల్లా తృతీయ స్థానాల్లో ఉండగా, 49.7 శాతంతో గద్వాల జిల్లా నాలుగో స్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం పోషన్ అభియాన్ కింద 2018లో రాష్ట్రంలోని 16 జిల్లాల్లో పోషకాహార లోపం వల్ల పిల్లల్లో ఎదుగదల లేదని గుర్తించింది. 25 శాతం కంటే దిగువకు ఆ శాతాన్ని తెచ్చేందుకు కార్యక్రమాలను రూపొందించింది. అయినప్పటికీ గడిచిన నాలుగు సంవత్సరాల్లో పెద్దగా మార్పు రాలేదు. ఇప్పటికీ చాలా జిల్లాల్లో 30 శాతం కంటే ఎక్కువగానే పోషకాహార లోపంతో పిల్లలు ఎదగడం లేదు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే -5 ప్రకారం పోషన్ అభియాన్ కింద గుర్తించిన 16 జిల్లాలకు గాను 15 జిల్లాల్లో పిల్లలు ఎత్తు పెరగడం లేదని కేంద్రం గుర్తించింది. ఎదుగుదల లేకపోవడం వల్ల భవిష్యత్‌లో చాలా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఎత్తు, బరువు తక్కువ..నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే -5 ప్రకారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాలుగు జిల్లాల వివరాలను వెల్లడించారు. సర్వే సమయానికి నారాయణపేట జిల్లా మహబూబ్‌నగర్‌లో అంతర్భాగంగా ఉండటంతో వివరాలు ఆ జిల్లా జాబితాలోనే ఉన్నాయి. నాలుగు జిల్లాల నివేదికలను పరిశీలిస్తే అన్నింటిలో ప్రధానంగా ఎత్తు, బరువు తక్కు వగా ఉండటం ఆందో ళన కలిగిస్తోంది. ఇప్పటికే ఎత్తు పెరగని చిన్నారు లు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో దేశంలో జోగుళాంబ గద్వాల జిల్లా నాలుగో స్థానంలో ఉం డగా, మిగతా జిల్లాల పరిస్థితి కూడా నిరాశాజనకంగానే ఉంది. పోషన్ అభియాన్ ప్రకారం ఎంపిక చేసిన జిల్లాల్లో పోషకాహార లోపం సమస్యను 25 శాతం కంటే తక్కువకు చేర్చడం లక్ష్యంగా పెట్టుకోగా, నాలుగు జిల్లాల్లో ఏ ఒక్క జిల్లా కూడా ఆ పారామీటర్‌కు చేరలేదు. ఎత్తు పెరగని జిల్లాల్లో జోగుళాంబ గద్వాల 49.7 శాతం వద్ద ఉండగా, నాగర్‌కర్నూల్ జిల్లా 35.1, మహబూబ్‌నగర్ జిల్లా 42.6, వనపర్తి జిల్లా 40.4 శాతం వద్ద ఉన్నాయి. ఇక బరువు పెరుగుదల కూడా ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాల్లో వయసుకు తగ్గట్లుగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. బరువు తక్కువ ఉన్న జిల్లాల్లో కూడా జోగుళాంబ గద్వాల జిల్లా 41.7 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, నాగర్‌కర్నూల్ జిల్లా 30.9 శాతం వద్ద, మహబూబ్‌నగర్ 33, వనపర్తి జిల్లా 33.2 శాతం వద్ద ఉన్నాయి. ఈ రెండు కేటగిరీల్లో ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాలూ కేంద్ర ప్రభుత్వ పారామీటర్లను చేరలేదు. ఇందుకు ప్రధాన కారణం పోషకాహార లోపమే అయినప్పటికీ, ప్రభుత్వం అందిస్తున్న పోషకా హారాన్ని పిల్లలందరికీ అందించకపోవడం కూడా మరో కారణంగా చెప్పొచ్చు.

# రెండు వారాలైనా రేషన్ అందదే..!



కామారెడ్డి : ప్రజా పంపిణీ బియ్యం లబ్ధిదారుల చెంతకు చేరడంలేదు. చౌకధరల దుకాణాల ద్వారా ప్రతి నెల ఒకటో తేదీ నుంచే పంపిణీ ప్రారంభంకావాల్సి ఉంది. ఈసారి మాత్రం రెండు వారాలు దాటినా సగానికి పైగా దుకాణాల్లో మొదలేకాలేదు. ఒక్కో యూనిట్‌కు 15 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 578 రేషన్ దుకాణాలు ఉండగా ఇప్పటి వరకు 87 దుకాణాలకు పంపిణీనే జరగలేదు. మిగతా వాటిల్లోనూ చాలావరకు సగం కోటానే పంపారు. సమయానికి బియ్యం అందక పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేవలం రేషన్ బియ్యం మీదే ఆధారపడి జీవనం సాగించే ఒంటరి వృద్ధులు బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిల్వలకు కష్టమే..రేషన్ దుకాణాలు చాలా చోట్ల ఇరుకుగా ఉన్నాయి. కోటా అధికం కావడంతో బియ్యం నిల్వలకు చోటు లేకుండా పోయిందని కొందరు డీలర్లు పేర్కొంటున్నారు. అందుకే సగం కోటానే దించుకున్నామని చెబుతున్నారు. వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసిన తర్వాత మిగతా కోటా తీసుకుంటామంటున్నారు. కొన్ని చోట్ల బియ్యం దించుకున్న డీలర్లు రెండు మూడు రోజులుగా పంపిణీ చేయడం లేదు.

కోటా అధికం కావడం వల్లేనా.. సాధారణంగా యూనిట్‌కు 6 కిలోలు ఇచ్చేవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు కిలోల చొప్పున పది కిలోల బియ్యాన్ని ఈ ఏడాది నవంబరు వరకు పంపిణీ చేయనున్నాయి. గతంలో కేంద్రం పంపిణీ చేసిన 5 కిలోల బియ్యాన్ని ఈ నెలలో అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు యూనిట్‌కు 15 కిలోల చొప్పున అందుతున్నాయి. ఒక్కసారిగా కోటా పెరగడంతో ఎంఎల్ఎస్ కేంద్రాల నుంచి దుకాణాలకు సరఫరా చేయడంలో ఆలస్యం జరుగుతోందని తెలుస్తోంది. సాధారణంగా ప్రతి నెల 25 నుంచి 30వ తేదీ వరకు రవాణా చేసేవారు. ఈ నెలలో ఇప్పటికీ అందించలేదు. గిడ్డంగుల నుంచి ఎంఎల్ఎస్ కేంద్రాలకు కూడా సకాలంలో బియ్యం చేరలేదని సమాచారం. ఇలా ఎక్కడికక్కడ ఆలస్యం జరగడంతో ప్రజలకు బియ్యం చేరలేదు.

కొంత ఆలస్యం జరిగింది – జితేంద్రప్రసాద్, డీఎం పౌరసరఫరాలశాఖ, కామారెడ్డి

ఈ నెల రేషన్ కోటా పెరగడంతో రవాణా కొంత ఆలస్యమైంది. యూనిట్‌కు 10 నుంచి 15 కిలోల వరకు అందిస్తున్నాం. వారం రోజుల్లో ముగిసే పంపిణీ ఈసారి ఇంకా పూర్తికాలేదు. దాదాపు అన్ని దుకాణాలకు బియ్యం పంపిణీ చేశాం.

# బజారుకెళితే భరించాల్సిందే!

ఆసిఫాబాద్ : జిల్లాలోని పట్టణాల్లో కాలకృత్యాలు తీర్చుకోవడం కష్టంగా మారింది. సరిపడా ప్రజా మరుగుదొడ్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. సమీపంలో మూత్రశాలలు లేకపోవడంతో కొందరు ఎక్కడో సందు చూసుకుని కానిచ్చేస్తున్నారు. మహిళల బాధ మాత్రం వర్ణనాతీతం. తిరిగి ఇంటికి వెళ్లేదాకా భరించక తప్పడం లేదు. దీంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉన్నా అన్ని మున్సిపాలిటీల్లో ఆ సదుపాయం లేదు. పట్టణ ప్రగతి కింద పాత ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి, వాటిలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా అధునాతన మరుగుదొడ్లు, మూత్రశాలల సదుపాయాన్ని కల్పించాల్సి ఉంది. ఆదిలాబాద్, మంచిర్యాల, కాగజ్‌నగర్ పురపాలికలను మినహాయిస్తే ఇతర చోట్ల బయో టాయిలెట్ సదుపాయం అందుబాటులో లేదు. అయితే బస్సు లోపలి మరుగుదొడ్లను వినియోగించేందుకు ప్రజలు అంతగా ఆసక్తి కనబర్చడం లేదు.అవసరమైన చోట లేకస్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం పురపాలికల్లో ప్రతి వేయి జనాభాకు ఒక మరుగుదొడ్డి(సీటు) చొప్పున అందుబాటులో ఉండాలి. లక్ష జనాభాకు 100 సీట్లు అందులో స్త్రీ, పురుషులకు 50 చొప్పున ఉండాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం నిత్యం వేలాది మంది పట్టణాలకు షాపింగ్ కోసం వస్తుంటారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని చాలా పురపాలికల్లో సరిపడా సదుపాయాలు లేవు. జనసంచారం ఎక్కువగా ఉండే చోట మరుగుదొడ్ల అవసరాలు ఎక్కువగా ఉంటాయి. అయితే పట్టణాల్లో జనాలు ఎక్కువగా తిరిగే చోట మూత్రశాలల నిర్మాణానికి స్థలాలు లేకపోవడం సమస్యగా మారింది. బీఓటీ(బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిన నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణను కొందరు ప్రైవేటు సిబ్బందికి అప్పగించారు. మరుగుదొడ్డి వినియోగించిన వారి నుంచి రూ.5 మాత్రమే తీసుకోవాల్సి ఉండగా రూ.10 వరకు వసూలు చేస్తున్నా శుభ్రతా చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా బల్దియా పాలకవర్గాలు ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్డి, మూత్రశాలల వసతులు కల్పించాల్సి ఉంది.

# దారిలేని దైన్యం.. వైద్యసేవలు మృగ్యం

ఆసిఫాబాద్ : భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్లు కాబోయే అమ్మలకు కడుపుకోతను మిగిల్చుతున్నాయి. కొట్టుకుపోయిన కల్వర్టులు ప్రసవాన్ని ప్రాణాంతకం చేస్తున్నాయి. మరమ్మతుల్లో నెలకొన్న జాప్యం పసి ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి, పచ్చిబాలింత సైతం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. ఈక్రమంలో మార్గమధ్యలోనే వీరి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రహదారులు, కల్వర్టులు తెగిపోయి పక్షం రోజులు గడుస్తున్నా ఎక్కడా అధికారులు మరమ్మతులు చేయడం లేదు. వర్షాలు అప్పుడప్పుడు తెరిపినిస్తున్నా, రోడ్లను, కల్వర్టులను బాగు చేసే పనులేవి జిజిల్లాలో ప్రారంభం కాలేదు.రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం జిల్లాలో నమోదైంది. ఈ నేపథ్యంలో వాగులు, నదులు ఉగ్రరూపం దాల్చడంతో ఆయా గ్రామాల్లో ఉండే ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. జిల్లాలో లోలెవల్ కల్వర్టులు వరదల తాకిడికి ధ్వంసమయ్యాయి. ద్విచక్రవాహనం సైతం వెళ్లలేని విధంగా మారాయి. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 26 రోడ్లు దెబ్బతినగా, మరమ్మతుల కోసం రూ.1.93 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. ఆర్అండ్‌బీ శాఖ నుంచి 24 రహదారుల మరమ్మతులకు రూ.82 లక్షలతో పాటు 22 కల్వర్టులు, వంతెనలు నిర్మించడానికి రూ.49 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు చేశారు.

నిధులు లేక.. పనులు సాగక

మరమ్మతులకు అవసరమైన నిధుల కేటాయింపులేవీ జిల్లాకు లేకపోవడం వల్ల ఒక్క పనిని సైతం చేపట్టలేదని అధికారులు అంటున్నారు. పగిలిన, కోతకు గురైన రోడ్లు, కల్వర్టులను అతికష్టం మీద ప్రజలు దాటుతున్నారు. ఈ తరుణంలో స్థానిక నాయకులు, నేతలు చిన్నపాటి మరమ్మతులైనా చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అధికారులు ఏమంటున్నారంటే..: మరమ్మతుల గురించి ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్న, పీఆర్ ఈఈ రాంమోహన్‌రావు మాట్లాడుతూ.. నిధులు విడుదల కాగానే మరమ్మతుల పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

ఆపత్కాలం.. ముందుకు వెళ్లలేం..

బెజ్జూర్ మండలం నాగేపల్లికి చెందిన కొడప మల్లుబాయికి ఈ నెల 21న పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. బెజ్జూర్ పీహెచ్‌సీకి బయలుదేరగా మార్గమధ్యలో సుశ్మీర్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మరోమార్గం చింతలమానేపల్లి మండలం గూడెం మీదుగా బెజ్జూరుకు వెళ్దామని ఆటోలో బయల్దేరారు. కోయపల్లి వద్ద కల్వర్టు కోతకు గురికావడంతో అక్కడి నుంచి ముందుకు వెళ్లలేకపోయారు. ఈక్రమంలో మల్లుబాయి కల్వర్టుపైనే ప్రసవించింది. రెండురోజుల అనంతరం బిడ్డ మృత్యువాత పడ్డాడు.

మరమ్మతులు ఎప్పుడు చేస్తారో?

కెరమెరి మండలంలోని కర్పెతగూడ వెళ్లడానికి చిన్న కాలువను దాటాల్సి ఉంటుంది. వరదలకు కల్వర్టు కొట్టుకుపోయింది. ప్రస్తుతం గ్రామస్థులు ఈ కాలువను దాటడానికి నానాపాట్లు పడుతున్నారు. కనీస మరమ్మతులు కూడా కరవయ్యాయి.

తల్లీబిడ్డలకు తప్పిన ముప్పు..

బెజ్జూరు మండలం కమ్మర్‌గాం గ్రామ పంచాయతీ నందిగాం గ్రామానికి చెందిన తలండి సులోచన బుధవారం ఇంటి దగ్గర ప్రసవమైంది. పండంటి బాబు పుట్టాడు. తల్లి, బిడ్డలకు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకు వెళ్లాల్సి వచ్చింది. రోడ్డేమో బాగోలేదు.. వాహనాలు సైతం నడవలేని పరిస్థితిలో పంచాయతీ ట్రాక్టరులో తరలించాల్సి వచ్చింది. అస్తవ్యస్తంగా ఉన్న దారిలో ఓ చోట ధ్వంసమైన కల్వర్టు ఉంది. కొంచెం అటు ఇటు అయినా ప్రాణాలు గల్లంతే. స్థానికుల సాయంతో ట్రాక్టరును కల్వర్టు దాటించి బెజ్జూరు పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి సుంకన్న వారిని పరీక్షించి తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. 3రోజుల తర్వాత ఇంటికి పంపిస్తామన్నారు.

బురదలో కూరుకుపోయిన అంబులెన్సు

ఎంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడ రోడ్డులో కాలినడక కూడా కష్టమే. బుధవారం గ్రామానికి చెందిన నలుగురు గర్భిణులను స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు 102 వాహనంలో బయల్దేరగా.. బొక్కివాగు వంతెన సమీపంలో వాహనం బురదలో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని అతికష్టం మీద వాహనాన్ని బయటికి నెట్టారు. దీంతో గర్భిణులు కొద్దిదూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని బాగు చేయాలని వారు వేడుకుంటున్నారు.

# ఘన వ్యర్థాల నిర్వహణపై చిత్తశుద్ధి ఏదీ!

పెద్దపల్లి: పేరుకుపోతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది. రకరకాల వ్యాధులు విజృంభిస్తున్నాయి. బల్దియాల ఆధ్వర్యంలో చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీకి వివిధ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణలో కీలకమైన బయోమైనింగ్ విధానం అమలుకు పురపాలక శాఖ శ్రీకారం చుట్టింది. కొండల్లా పేరుకుపోతున్న టన్నుల కొద్దీ చెత్తను ప్రాసెస్ చేసి ఘన వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపే దిశగా కార్యాచరణ వేగవంతం చేసింది. బయోమైనింగ్‌కు ముందుకొచ్చే సంస్థలను గుర్తించి టెండరు ప్రక్రియను కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన ప్రమాణాలు, జాతీయ హరిత ట్రైబ్యునల్ మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాలు నిర్వహించే బయోమైనింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు.

**గోదావరి ఒడ్డునే చెత్త గుట్టలు**

పురపాలక శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థలో మొత్తం 11 క్లస్టర్లు విభజించి బయోమైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. 4 లక్షల జనాభా ఉండే రామగుండం నగరంలో మాత్రం ఇప్పటివరకు డంపింగ్ యార్డుల నిర్వహణే సరిగ్గా లేదు. ఓసీపీ–5 ప్రారంభం కావడంతో గతంలో ఉన్న డంపింగ్ యార్డును మూసేశారు. ప్రస్తుతం గోదావరికి సమీపంలోనే చెత్తను పారవేస్తుండటంతో వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయి. కరీంనగర్ తరహాలో ఇక్కడ బయోమైనింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఘన వ్యర్థాల



నిర్వహణలో భాగంగా బయో మైనింగ్ సాంకేతికతను ఉపయోగించి విశాలమైన డంపింగ్‌యార్డు కోసం సర్వే చేసి నగర శివారులో ఏర్పాటు చేస్తారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన వివిధ రకాల చెత్త, చెదారాలను, వ్యర్థాలను ప్రత్యేకంగా వేరు చేసేందుకు భారీ యంత్రాల ఏర్పాటు కోసం ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తారు. పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ దాదాపు 50 టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి.

**ఆధునిక సాంకేతికతతో..**

పేరుకుపోయిన ఘన వ్యర్థాలను శుద్ధి చేయడంతో పాటు ప్రతి రోజూ ఉత్పన్నమయ్యే ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేయడం బయోమైనింగ్‌లో కీలకం. నిర్దేశిత ప్రమాణాల మేరకు వ్యర్థాలను వేర్వేరుగా రీసైక్లింగ్ చేస్తారు. ఉక్కు, ఇతరత్రా పరిశ్రమల్లో బొగ్గుకు బదులుగా పనికొచ్చే ప్లాస్టిక్ వ్యర్థాల ఎరువులు వినియోగించనున్నారు. ఇండోర్, ముంబయి, విశాఖ నగరాల తరహాలో ఈ బయోమైనింగ్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. తడి, పొడి చెత్తలను సేకరించి 8 గ్రేడులుగా విభజించి సేంద్రియ ఎరువులను తయారు చేయనున్నారు. తడి, పొడి చెత్తలను సేకరించి కంపోస్టుగా మారుస్తారు. చెత్తలో అంతర్భాగంగా ఉన్న మెగ్నీషియం, జింక్, కాల్షియం వంటి వివిధ రకాల ధాతువులను వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేస్తారు.

**పెరగనున్న భూసారం**

జిల్లావ్యాప్తంగా ఏటా 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర ఎరువులను వినియోగిస్తున్నారు. యూరియా, డీఏపీ, ఇతర ఎరువుల అతి వినియోగంతో క్రమేణా భూసారం తగ్గుతోంది. పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ విధానం వల్ల రసాయన రహిత సాగు విధానం పెరిగి భూసార వృద్ధితో పాటు దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు తక్కువగా ఉంటుంది. బయోమైనింగ్ ద్వారా ఉత్పత్తి చేసిన ఎరువులను పొలాల్లో చల్లడం వల్ల భూసారం పెరిగి పోషకాలు సమృద్ధిగా లభించే పంట చేతికందుతుంది. ప్లాస్టిక్ వ్యర్థాల ఎరువులను స్టీల్, ఇతర పరిశ్రమల్లో బొగ్గుకు బదులుగా ఇంధనంగా వాడేందుకు బయోమైనింగ్ పద్ధతి ఉపయోగపడనుంది. చేపల చెరువుల్లోని అడుగు భాగంలో అమ్మోనియా గాఢతను స్థిరీకరించి జలచరాల మనుగడకు భరోసా కల్పించేందుకు ఈ ఎరువును ఉపయోగించనున్నారు.

# వరద ముంచెత్తింది.. నిర్లక్ష్యం ఏరైంది!

మంథని : ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.7 కోట్లకు పైగా నిధులతో సమకూర్చిన పరికరాలు.. వరద నీటిలో మునిగి పనికి రాకుండా పోయాయి.. సంవత్సరం సమీపిస్తున్నా పునరుద్ధరణకు నోచుకోలేదు.. గతేడాది జులైలో కురిసిన భారీ వర్షాలకు పట్టణాన్ని వరద ముంచెత్తింది.. స్థానికంగా 50 పడకల సామర్థ్యం కలిగిన మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని అతలాకుతలం చేసింది..

**ఏం జరిగింది?**

1.1 ఎకరాల్లో రూ.7 కోట్లతో మంథనిలో నిర్మించిన 50 మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని 2022 జూన్ 21న మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. అనంతరం పక్షం రోజులకే సమీపంలోని బొక్కలవాగు ఉప్పొంగడంతో లోతట్టు ప్రాంతంలోని ఎంసీహెచ్‌ను వరద ముంచెత్తింది. అప్పటికి ఆసుపత్రిలోని గదులు, ఫర్నీచర్, ల్యాబ్ యంత్రాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. పరికరాలన్నీ కవర్లతోనే ఉండగా, బురద కప్పేసింది. కొత్త గదుల్లోని విద్యుత్తు వ్యవస్థ మొత్తం తడిసింది. ఆసుపత్రి బయట ఉన్న జనరేటర్ వ్యవస్థ నీట మునిగింది. నియంత్రికలోకి వరద చేరడంతో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. దాదాపు నెల రోజుల పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. రూ.లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు, యంత్రాలు, ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు.. అన్నీ నీటి పాలై పనికి రాకుండా పోయాయి.

**పునరావృతమైతే ఎలా?**

వర్షాకాలం సమీస్తుండటంతో మరోసారి వరదలు వస్తే తమ పరిస్థితి ఏమిటని మంథని ఎంసీహెచ్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వరద భయం పొంచి ఉన్నా ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, జడ్పీ ఛైర్మన్ మధూకర్‌లతో పాటు కలెక్టర్, వైద్యాధికారులు స్పందించి అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో పాటు వరద నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రస్తుత పరిస్థితి..** ఇప్పటికీ పరిస్థితులు ఏం మారలేదు. కేవలం వైద్య సేవలు మాత్రమే అందిస్తుండగా అత్యాధునిక పరికరాలతో చికిత్సల జోలికి పోవడం లేదు. వరదలో మునిగిన యంత్రాలు పని చేయడం లేదు. మరమ్మతు చేయాలని రాష్ట్ర వైద్య, మౌలిక వసతుల సంస్థ అధికారులకు ఆసుపత్రి వర్గాలు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రసూతి, నవజాత శిశువు కేంద్రం, టీకా , శస్త్రచికిత్స గది, నర్స్ రూం, లేబర్ రూం, ఆక్సిజన్, అత్యవసర విభాగం, ఐసోలేషన్ వార్డు.. ఒక్కటేమిటి.. అన్ని గదుల నిండా నీరు చేరడంతో ఫ్యాన్లు, ఏసీలు తడిసి పని చేయడం లేదు. ఇప్పటికీ స్విచ్ బోర్డుల్లో తరచూ సాంకేతిక సమస్య నెలకొని విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులతో కాలిపోతున్నాయి.

# పచ్చబంగారం.. సాగుకు కష్టకాలం



మహబూబాబాద్ :విత్తన పసుపును చూపిస్తున్న ఈ రైతు మహబూబాబాద్ జిల్లా విలేజ్ కేసముద్రానికి చెందిన పసుల సమ్మయ్య. మూడెకరాల సాగు భూమి ఉంది. ఏటా పసుపు పంట కోసం ఎకరంన్నర భూమిని కేటాయించేవారు. గతేడాది సాగు చేస్తే 16 క్వింటాళ్ల పంట చేతికొచ్చింది. విక్రయిస్తే ధర లేక పెట్టుబడులు సైతం రాలేదు. ఈ ఏడాది సాగును మానుకోవాలనుకున్నారు. చివరికి మనసు చంపుకోలేక 10 గుంటల్లో సాగు చేసేందుకు విత్తన పసుపు తీసుకున్నానని చెబుతున్నారు. ఈ గ్రామంలో కొంత మంది రైతులు పసుపు వేయడం మానుకొని ఇతర పంటల వైపు మళ్లారు. మరికొందరు విత్తన పసుపు కోసం 5 నుంచి 10 గుంటల్లో సాగు చేసుకుంటున్నారు. ఈ సమస్య రాష్ట్రంలో పసుపు సాగుచేసే చాలా మంది రైతులది.. పచ్చబంగారంగా పిలిచే పసుపు సాగు రాష్ట్రంలో తగ్గుముఖం పట్టింది. తెగుళ్ల కారణంగా ఆశించిన దిగుబడులు రాకపోవడం.. గిట్టుబాటు ధర దక్కక పోవడం ఇందుకు కారణం. వచ్చిన ఆదాయంలోంచి పెరిగిన పెట్టుబడి ఖర్చులు తీసేయగా చివరకు అప్పులే మిగులుతున్నాయని పసుపు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటను వదులుకోవడం ఇష్టం లేక విస్తీర్ణాన్ని తగ్గించుకుంటున్నామని వాపోతున్నారు. ఉద్యానశాఖ అధికారులు ఇచ్చిన గణాంకాలను పరిశీలిస్తే అత్యధికంగా సాగయ్యే నిజామాబాద్, జగిత్యాల, మహబూబాబాద్, వరంగల్, నిర్మల్ జిల్లాలో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ప్రభుత్వం స్పందించి పంటకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని.. తెగుళ్లను తట్టుకునే విత్తన రకాలను అందుబాటులోకి తీసుకురావాలని పసుపు రైతులు కోరుతున్నారు.

**పూర్వవైభవం తీసుకురావాలంటే..**

రైతులు గతేడాది సాగు చేసిన పంట నుంచి విత్తనాన్ని సేకరిస్తారు. దీంతో చీడపీడల ఉద్ధృతి ఎక్కువగా ఉండి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. శాస్త్రవేత్తల సూచనల మేరకు నేల రకానికి అనుకూలమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి.

పసుపు పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి.

పసుపు సాగుకు బెడ్ పద్ధతి అనుకూలం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉంది. ఇందుకు రైతులకు రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందించాలి.

పసుపు పంట చేతికొచ్చే సమయంలో ధరలో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. నిల్వ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి.

అన్ని పంటల మాదిరిగా పసుపు క్వింటాలుకు రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించాలి.

పసుపు పండించటం ఒక ఎత్తైతే.. చేతికొచ్చిన పంటను ఉడికించడం, ఆరబెట్టడం, పాలిషింగ్ చేయడం మరొక ఎత్తు. ప్రభుత్వమే రైతు ఉత్పత్తిదారుల సంఘాల సహకారంతో కష్టం ఐరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి రైతుల నుంచి పచ్చి పసుపు ఖరీదు చేసి ప్రాసెసింగ్ చేయాలి.

**పడిపోతున్న సాగు**

ఉమ్మడి జిల్లాలోనూ పసుపు సాగు విస్తీర్ణం పడిపోతోంది. నాలుగేళ్ల కిందట సాగు విస్తీర్ణం 30 వేల ఎకరాలు ఉండేది. అలాంటిది గతేడాది 4,964 ఎకరాల్లో సాగైంది. అంటే 25,051 ఎకరాల సాగు తగ్గింది. వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో ఎక్కువగా సాగు చేసేవారు.

# సహాయ ఆచార్యులు విధుల్లో చేరేనా..!




గోదావరిఖని : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలల్లో సహాయ ఆచార్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కొందరు విధుల్లో చేరేందుకు వెనకంజ వేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో కొన్ని విభాగాల్లో సేవలు నిలిచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ విద్యా కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఉండాల్సిన సహాయ ఆచార్యులకంటే ఇటీవల తక్కువ పోస్టులను భర్తీ చేసినప్పటికీ వారు సైతం విధుల్లో చేరేందుకు వెనకంజ వేస్తుండగా... విధుల్లో చేరుతున్నట్లు రిపోర్టు చేసిన సహాయ ఆచార్యుల్లోనూ కొందరు విధుల్లోకి రావడం లేదు. దీంతో ఆసుపత్రులు, వైద్య కళాశాలల నిర్వహణలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆచార్యులు, సహాయ ఆచార్యుల సంఖ్య సైతం వైద్య కళాశాలల్లో నామమాత్రంగానే ఉండగా వాటిని సైతం భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. కీలకమైన కొన్ని విభాగాల్లో కొరత ఉండగా ఆయా విభాగాల్లో నియామకాలు జరగలేదు. రోగ నిర్ధారణలో కీలకమైన రేడియాలజీ విభాగంలోనే ఖాళీలు అత్యధికంగా ఉండంతో ఆసుపత్రుల్లో సీటీ స్కాన్ లాంటి అత్యాధునిక రోగనిర్ధారణ పరీక్షల నిర్వహణ నామమాత్రం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1061 మందిని సహాయ ఆచార్యులుగా నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు గత నెలలో నియామక ఉత్తర్వులు అందించారు. బుధవారం నాటికి విధుల్లో చేరాల్సిన గడువు ఉండగా సుమారు 690 మంది మాత్రమే విధుల్లో చేరారు. ఇందులో రామగుండంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు 45 మంది సహాయ ఆచార్యులను నియమించగా ఇప్పటి వరకు 39 మంది విధుల్లో చేరారు. వారిలో కొందరు జాయినింగ్ రిపోర్టు ఇచ్చి వెళ్లాక విధులకు రాకపోవడం గమనార్హం.

**పోస్టులు 140.. నియామకం 45.. విధుల్లో చేరింది 39**

ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం జారీ చేసిన జీఓ 107 ప్రకారం గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని వివిధ విభాగాల్లో మొత్తం 140 మంది సహాయ ఆచార్యులు ఉండాల్సి ఉండగా ఇటీవల కేవలం 45 పోస్టులను మాత్రమే ప్రభుత్వం భర్తీ చేసింది. అందులో 39 మంది మాత్రమే విధుల్లో చేరారు. విధుల్లో చేరిన వారిలోనూ కొందరు నేటికీ రాకపోవడంతో వారు సేవలు అందిస్తారా అన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన సహాయ ఆచార్యుల్లో గోదావరిఖని వైద్య కళాశాలకు ఫోరెన్సిక్, ఫిజియాలజీ విభాగాల్లో నియామకాలే లేకపోగా రేడియాలజీలో ఇద్దరిని నియమించినప్పటికీ వారు విధుల్లో చేరలేదు. గోదావరిఖని ఆసుపత్రిలో రేడియాలజీ విభాగంలో ఒకరు ఆచార్యులు, ఇద్దరు సహాయ ఆచార్యులు, ఐదుగురు సహాయ ఆచార్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే విధుల్లో ఉన్నారు. ఇద్దరిని నియమించినా వారు విధుల్లో చేరలేదు. ఫిజియాలజీ, ఫోరెన్సిక్ విభాగంలో దాదాపుగా అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోక్రానాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ తదితర సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో పోస్టులున్నా నియామకాలు లేక ఖాళీగానే ఉన్నాయి.

**ప్రైవేటు ప్రాక్టీసు నిషేధం ప్రభావమేనా...**

కొత్తగా విధుల్లో చేరనున్న ఆచార్యులు, సహాయ ఆచార్యులు ప్రైవేటు ప్రాక్టీసు చేయరాదంటూ ప్రభుత్వం షరతులు విధించడంతోనే ఇటీవల నియామకాలు జరిగినప్పటికీ కొందరు సహాయ ఆచార్యులు విధుల్లో చేరేందుకు వెనకంజ వేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానమైన రేడియాలజీ, ఫోరెన్సిక్, ఫిజియాలజీ తదితర విభాగాల్లో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో భారాస్థాయిలో వేతనాలు చెల్లిస్తుండగా సహాయ ఆచార్యులుగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తక్కువగా చెల్లిస్తుండటంతో ఆయా విభాగాల్లోని వైద్యులు ప్రైవేటునకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఒప్పంద విధానంలో పనిచేసే వారికంటే రెగ్యులర్‌గా పనిచేసే వారి వేతనాలు తక్కువగా ఉన్నట్లు సమాచారం. ఒప్పంద విధానంలో కొన్ని విభాగాల్లో అదనంగా అలవెన్సులు చెల్లిస్తుండగా రెగ్యులర్ వారికి లేవు. ప్రైవేటు ప్రాక్టీసు చేయరాదన్న ప్రభుత్వం దానికి అనుగుణంగా కొంత ఆర్థిక ప్రోత్సాహం ఇస్తే కొందరైనా విధుల్లో చేరేందుకు ముందుకు వచ్చే అవకాశముంది.

# అందని ధాన్యం డబ్బులు.. పెట్టుబడికి తిప్పలు

సిరిసిల్ల: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయించిన రైతన్నలకు వాటికి సంబంధించిన డబ్బులు ఇప్పటి వరకు అందలేదు. దీంతో పెట్టుబడికి చేతిలో చిల్లి గవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం డబ్బుల కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందోనని ఎదురుచూస్తోన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వమే మద్దతు ధరకు సేకరించడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. విక్రయించిన 72 గంటల్లో డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన ప్రకటనలు ఆచరణ కావడం లేదు. అసలే ఓవైపు వర్షాలు, మరోవైపు ఈదురుగాలులు, వడగండ్ల వానతో రైతులు పంటలను తీవ్రంగా నష్టపోయారు. ఇదిలా ఉండగా కొనుగోళ్ల సమయంలో తూకం వేసిన దగ్గర నుంచి మిల్లర్లు దించుకునే వరకు తాలు, తేమ పేరిట కొర్రీలు పెట్టి తూకంలో కోతలు విధించారు. ఇన్ని ఇబ్బందులు పడిన కర్షకులకు ధాన్యం డబ్బులు ఇంకా ఖాతాల్లో జమ కాకపోవడంతో వచ్చే వానాకాలం సీజన్ సాగుకు పెట్టుబడికి తిప్పలు తప్పడం లేదు.

వానాకాలం సీజన్ ప్రారంభమైనా...యాసంగి సీజన్ పూర్తయింది. వానలు పడితే వానాకాలం పనులు జోరందుకోనున్నాయి. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను వేశారు. పత్తి, వరి విత్తనాలను రైతులు తెచ్చుకుంటున్నారు. మరోవైపు నారు పోసే పనులు సాగుతున్నాయి. అయితే వీటన్నింటికి చేతిలో పెట్టుబడి లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం విక్రయించిన డబ్బులు త్వరగా రైతుల ఖాతాల్లోకి జమ చేసినట్లయితే కొంత భారం తగ్గుతుందని చెబుతున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా 258 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయంగా ఇప్పటి వరకు 253 కేంద్రాల్లో సేకరణ పూర్తి కావడంతో వాటిని మూసివేశారు. మిగతా వాటిలో కూడా ఒకటి, రెండు రోజుల్లో సేకరణ పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

**త్వరలోనే కొనుగోళ్లు పూర్తి చేస్తాం– జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో**

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 258 కేంద్రాలను ఏర్పాటు చేశాం.

# అదనపు ఎత్తిపోతలు ఎప్పుడో?

సిరిసిల్ల: కాళేశ్వరం 9వ ప్యాకేజీలో తొలి దశ మల్కపేట పంపుహౌజ్‌లో మోటార్ల ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ ప్యాకేజీని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రారంభించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. 9వ ప్యాకేజీలో సాగునీరందని ప్రాంతాలకు అదనపు ఎత్తిపోతలు నిర్మిస్తున్నారు. 2017 అక్టోబరులో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా రూ.166 కోట్లతో మల్కపేట జలాశయానికి అదనపు ఎత్తిపోతలను మంజూరు చేశారు. దీనిలో నాలుగు పంపుహౌజ్‌ల నిర్మాణంతో ఎగువన ఉన్న సుమారు పది వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలనేది లక్ష్యం. ఆరేళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. పంపుహౌజ్‌లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు 212 ఎకరాల భూసేకరణ అవసరం. ఇప్పటికీ కేవలం 30 ఎకరాలు మాత్రమే సేకరించారు. ప్రభుత్వం చెల్లించే పరిహారానికి, ఇక్కడ బహిరంగ మార్కెట్‌లోని భూముల ధరలకు పొంతన లేకపోవడమే ఇందుకు కారణం. కొన్ని చోట్ల రైతులు భూములిచ్చేందుకు అంగీకరించినా వారికి పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలేదు. దీంతో రెండేళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. కోనరావుపేటకు చెందిన ఈ రైతు పేరు కస్తూరి మధుకర్. అదనపు ఎత్తిపోతల పథకం కోసం 1.18 ఎకరాలు సేకరించారు. భూమితోపాటు అందులోని పశువుల పాక, చెట్లు, వ్యవసాయ బావికి కలిపి మొత్తం రూ.30 లక్షలు పరిహారంగా లెక్కించారు. రెవెన్యూ అధికారుల సమావేశంలో పరిహారం పొందేందుకు సంతకం తీసుకున్నారు. బ్యాంకులో కేవలం రూ.15 లక్షలు మాత్రమే జమయ్యాయి. ఏడాదిన్నరగా మిగతా డబ్బులు రావడం లేదు. మండల కేంద్రం పరిధిలో వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.30 లక్షల వరకు ధర పలుకుతుంది. ప్రభుత్వం మాత్రం ఎకరానికి రూ. 10.80 లక్షలు మాత్రమే పరిహారం చెల్లిస్తుంది. ప్రభుత్వమిచ్చే పరిహారంతో పది గుంటలు కూడా కొనలేమని చాలా మంది రైతులు భూములు ఇచ్చేందుకు వెనకాడుతున్నారు.

పంపుహౌజ్–1 మల్కపేట జలాశయం ఎడమ ప్రధాన కాల్వ పైన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ వద్ద పంపుహౌజ్ నిర్మిస్తున్నారు. దీనిలో రెండు మోటార్ల ద్వారా మద్దిమల్ల, వీర్నపల్లి, కంచర్ల గ్రామాల్లోని 2,435 ఎకరాలకు సాగునీరందిస్తారు. ప్రస్తుతం పంపుహౌజ్ నిర్మాణం మాత్రమే జరిగింది.

2. కోనరావుపేట మండలం శివంగళపల్లి వద్ద నిర్మించే పంపుహౌజ్‌తో ఆ గ్రామానికి 335 ఎకరాలకు సాగునీరందుతుంది. ఇక్కడ పంపుహౌజ్ నిర్మాణంలో సివిల్ పనులు జరుగుతున్నాయి.

3. జలాశయం ఎడమ ప్రధాన కాల్వ 7.37 కిలోమీటర్లు ఉంటుంది. దీనిపై నిమ్మపల్లి సమీపంలో పంపుహౌజ్‌ను నిర్మిస్తున్నారు. ఇందులోని రెండు మోటార్ల ద్వారా మూలవాగు జలాశయంలోకి నీటిని తరలిస్తారు. దీనికి కుడి, ఎడమ కాల్వల ద్వారా నిమ్మపల్లి, వట్టిమల్ల, కొండాపూర్ గ్రామాల పరిధిలోని 2,800 ఎకరాలకు సాగునీరందుతుంది. పంపుహౌజ్ నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి.

4. వీర్నపల్లి మండలం గర్జనపల్లి పంపుహౌజ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ అటవీశాఖ భూమి ఉండటంతో అనుమతుల్లో ఆలస్యమవుతోంది. ఈ పంపుహౌజ్‌లో మూడు పంపులు ఏర్పాటు చేస్తారు. వీటిలో మొదటి పంపు నుంచి తాటిపల్లి, మరిమడ్ల, గర్జనపల్లి గ్రామాలు, రెండో పంపుతో గర్జనపల్లి, వన్‌పల్లికి, మూడో పంపు పదిర, రంగంపేట గ్రామాల్లోని 3,581 ఎకరాలకు సాగునీరందించనున్నారు. అదనపు ఎత్తిపోతల పథకంలో మూడు పంపుహౌజ్‌ల్లో సివిల్ పనులు పూర్తయ్యాయి. ఒకటి, మూడు పంపుహౌజ్‌ల్లో మోటార్ల బిగింపు స్థాయిలో ఉన్నాయి. పంపుహౌజ్‌లోకి వచ్చే కాల్వలు, అక్కడి నుంచి ఆయకట్టుకు నీరందించే ప్రధాన కాల్వలు, వాటి కింద డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు భూసేకరణ అసంపూర్తి దశలో ఉంది.

**భూసేకరణ పూర్తి చేస్తాం– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ,** అదనపు ఎత్తిపోతలు పథకానికి అవసరమైన భూసేకరణ సర్వే పూర్తయింది. కొంతమేరకు అటవీ భూమి ఉండటంతో కొంత జాప్యం జరుగుతోంది. పరిహారం చెల్లింపులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

# భద్రత.. రక్షణ.. సేవలు

కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. సమీకృత నిఘా నిర్వహణ కేంద్రం (ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్) కోసం రూ.94.99 కోట్లు కేటాయించి పనులను తుది దశకు తీసుకొచ్చారు. నగరంలో ఒకే చోట ఉండి ఏం జరుగుతుందో పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండేందుకు భద్రత, రక్షణ, సేవలు వినియోగించుకోవడానికి అవకాశం లభించింది. ప్రస్తుతం నగరపాలక సంస్థ కార్యాలయంలోనే ఉండగా త్వరలోనే రామగుండం బైపాస్ రోడ్డులోని తీగల వంతెన సమీపంలోని పక్కా భవనంలోకి మార్చుతారు. మూడేళ్ల పాటు సంబంధిత ఏజెన్సీనే నిర్వహణ చూసుకుంటుంది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ సేవలను ప్రారంభించిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

**18 ప్రాంతాల్లో..** రద్దీ ప్రాంతాల్లో ప్రతిఒక్కరికీ ఉచితంగా అంతర్జాల సౌకర్యం అందుబాటులోకి రానుంది. 18 ప్రాంతాల్లో 120 హాట్‌స్పాట్లు బిగించారు. నగరపాలిక, ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్ఆర్ఆర్ కళాశాల, కలెక్టరేట్, పోలీసు కమిషనరేట్, కోర్టు, ఆర్టీసీ బస్టాండ్, అన్ని కూడళ్లలలో వీటిని ఏర్పాటు చేశారు. నగరవ్యాప్తంగా 15 వేల మంది ఏకకాలంలో ఇంటర్నెట్ పొందే వీలుంది. ఒక పాయింట్ దగ్గర 90–100 మంది ఉపయోగించుకోవచ్చు. మున్సిపల్ ఫ్రీ వైఫై రాగానే క్లిక్ చేసి రిజిస్టర్ చేసుకోవాలి. ఫోన్‌నంబర్ నమోదు చేయాలి. దీనికి ఓటీపీ వస్తోంది. అది నమోదు కాగానే ఉచితంగా అంతర్జాలం పని చేస్తోంది. రోజుకు ఒక గంట లేదా 500ఎంబీ డేటాను పొందొచ్చు. ఆ తర్వాత దానికి అదే నిలిచి పోతుంది.

**పర్యావరణ సెన్సార్లు:** నగరంలో వాతావరణం తెలుసుకోవడం, ఉష్ణోగ్రతలు, వర్షపాతం, రానున్న రోజుల్లో వాతావరణం ఎలా ఉంటుందనే విషయాన్ని తెలుసుకునేందుకు వీలుగా 10 ప్రాంతాల్లో సెన్సార్లు బిగించారు.

**వాణిజ్య దుకాణాలకు క్యూఆర్ కోడ్:** పారిశుద్ధ్య పనుల నిర్వహణ, చెత్త సేకరణ కోసం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) అందుబాటులోకి వచ్చింది. వాణిజ్య ప్రాంతాల్లోని 4,150 దుకాణాలకు క్యూఆర్ కోడ్, జీపీఎస్ ట్రాకింగ్ పని చేయనుంది. ఆయా ప్రాంతాల్లో చెత్త నిండిన, రోజు తీసుకెళ్లకపోయిన వెంటనే సమాచారం అందిస్తోంది.

**ప్రస్తుతానికి పూర్తిస్థాయిలో పని చేసేవి ఇవే..** మొత్తం పది అంశాల్లో సాంకేతిక సేవలు అందుబాటులోకి రావాల్సి ఉండగా మిగతా చోట్ల పనులు చేపడుతున్నారు. సీసీ కెమెరాలు, ఆటోమెటిక్ ట్రాఫిక్ సిగ్నల్స్‌రెడ్ లైట్ ఉల్లంఘన కెమెరాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాల గుర్తింపు డిజిటల్ తెరలు, మైకులు, పర్యావరణ సెన్సార్లు ఫ్రీ వైఫై, పారిశుద్ధ్య పనుల నిర్వహణ.

**ఆటోమెటిక్ ట్రాఫిక్ సిగ్నల్స్:** రయ్‌మని దూసుకెళ్లడం తగ్గించి ఇక మీదట ట్రాఫిక్ సిగ్నల్స్ పరిశీలిస్తూ ముందుకు సాగాలి. 24 చోట్ల 85 ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండనున్నాయి. రెడ్ సిగ్నల్ అతిక్రమణలను గుర్తించేందుకు 85 కెమెరాలు పని చేస్తాయి. వ్యతిరేక నడిచే వాహనాల గుర్తింపు, వాహనాల వేగం గుర్తించేందుకు 174, ట్రాఫిక్ ఉల్లంఘన కోసం 85 కెమెరాలు ఏర్పాటు చేశారు. హెల్మెట్లు లేకుండా, ద్విచక్రవాహనంపై ముగ్గురు వెళ్లడం, సీటు బెల్టు వంటి నిబంధనలు పాటించకపోతే నాలుగు జంక్షన్లలో ఏర్పాటు చేసిన కెమెరాలు గుర్తించి ఈ చలానా విధిస్తాయి. ఈ మేరకు అధికారికంగా ప్రకటన జారీ చేస్తారు.

**కూడళ్ల దగ్గర మైకులు:** పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం మైకులను 20 ప్రాంతాల్లో 40 ఏర్పాటు చేశారు. దీంతో నగరపాలక కార్యాలయం నుంచే సమాచారాన్ని ప్రజలకు తెలిపే అవకాశం కలిగింది.

# తెలుగు తేట.. లెక్కల్లో బాసట

కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కన్పించడంలేదు. తెలుగు రాయడం, చదవడం రాదు.. కీలక అంశమైన గణితంలోనూ వెనుకబాటు. ఈ రెండు అంశాల్లో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులు నిర్ణయించుకున్నారు. వినూత్న బోధన పద్ధతికి శ్రీకారం చుట్టి సత్ఫలితాలు సాధించి రాష్ట్ర విద్యాశాఖ దృష్టిని ఆకర్షించారు. ఇదే విధానం ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళిక చేపట్టారు. ఇదీ పెనుబల్లి మండలం వీఎం బంజర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఘనత..

ప్రత్యేక ప్రణాళిక : జీవశాస్త్రం ఉపాధ్యాయుడికి బీఈడీ శిక్షణలో తెలుగు పాఠ్యాంశం ఉంటుంది. అలాగే భౌతిక శాస్త్రం మెథడాలజీలో గణితం ఉంటుంది. సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో పాటు ఆయా ఉపాధ్యాయులను కూడా ప్రత్యేక తరగతులకు కేటాయిస్తున్నారు. ఇలా అన్ని సెక్షన్లలో ఉపాధ్యాయులు ఉండేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మెరుగైన ఫలితాలు సాధిస్తూ జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లారు.

అధికారుల ప్రశంసలు

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ న్యూమెరసీ మిషన్) ప్రవేశపెట్టింది. 6 నుంచి 9 తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఎలాంటి పద్ధతులను ప్రవేశపెట్టాలి? ఎవరైనా అనుభవం ఉంటే చెప్పాలని ఎస్‌సీఆర్‌టీ(స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్) ప్రకటనను జిల్లా విద్యాశాఖధికారి వాట్సప్ గ్రూప్‌లో పెట్టారు. పాఠశాల హెచ్ఎం బండి నరసింహారావు తాము అవలంబిస్తున్న బోధన పద్ధతులు, పాఠశాలలో ఎన్నికల నిర్వహణ, వచ్చిన ఫలితాలను ఆ గ్రూప్‌లో



పోస్టు చేశారు. ఇందుకోసం ఉపాధ్యాయ సిబ్బంది 23 మంది, ఎన్నికైన విద్యార్థులు 27 మందితో బృందంగా ఏర్పడినట్టు వివరించారు. ఎన్‌సీఆర్‌టీ ఏర్పాటు చేసిన అఖిల భారత కార్యశాలకు 9 రాష్ట్రాల్లో 35 మంది హెచ్ఎంలను ఎంపిక చేశారు. వారిలో ఉన్న వీఎం బంజర్ పాఠశాల హెచ్ఎం మూడు రోజుల పాటు ఆన్‌లైన్లో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ విషయం రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లగా ఆయనను పిలిపించి మాట్లాడారు. వీఎం బంజర్ ఉన్నత పాఠశాలలో అనుసరిస్తున్న పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా అమలుకు కసరత్తు చేస్తోంది.

వీఎం బంజర పాఠశాలలో వినూత్న బోధన తీరు

ప్రధానోపాధ్యాయుడు బండి నరసింహారావు సారథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులు అందరు కలసి విద్యార్థుల కనీస సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను వారి వారి సామర్థ్యాలను కొలమానంగా తీసుకొని పది సెక్షన్లుగా విభజించారు. ఆయా అంశాల్లో వెనుకబాటు, ప్రగతిని బట్టి తరగతులతో సంబంధం లేకుండా ఆయా సెక్షన్లు కేటాయించారు. వారికి సాయంత్రం 7, 8 పీరియడ్లలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. అందులో అక్షరాల నుంచీ నేర్పిస్తారు. ఇలా గత విద్యాసంవత్సరం ఏమీ రాని విద్యార్థుల్లో తెలుగు పాఠ్యాంశంలో 60 శాతం పురోగతి సాధించగా, గణితంలో 33 శాతం ప్రగతి సాధించారు. మా పాఠశాల చదువుతున్న విద్యార్థులు అన్ని సామర్థ్యాలు పొందిన తర్వాతే బయటకు వెళ్లేలా నూతన బోధన పద్ధతులకు ప్రణాళికలు రూపొందించాం. రాష్ట్ర విద్యాశాఖధికారుల ప్రశంసలు పొందుతున్నాం. వీటిలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనది. ఈ ఏడాది రెండో దశకు వెళ్తున్నాం. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాం. బండి నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు, వీఎం బంజర్, పెనుబల్లి

# సాగు.. సందిగ్ధం

కొత్తగూడెం : వానాకాలం తొలి నాళ్లలోనే రైతులకు నిరాశ తప్పడం లేదు. మధ్యతరహాకు చెందిన వైరా జలాశయం ఆయకట్టులో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా సింహభాగం వరి సాగు చేస్తుంటారు. వానాకాలం సాగుకు సంబంధించి ఇంతవరకు స్పష్టత లేదు. జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం పడిపోతుంది. జలాశయం పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 18.3 అడుగులు కాగా మంగళవారం నాటికి 14.11 అడుగులకు చేరింది. 14.3 అడుగుల నీటిమట్టం వరకు మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా నిల్వ ఉంచాలనే నిబంధన ఉంది. ఇప్పటివరకు ఉన్న నీటిమట్టం కేవలం తాగునీటి అవసరాలకే సరిపోతుంది. వానాకాలం సాగును ముందుకు తీసుకురావాలనే అంశంపై ఇటీవల వ్యవసాయ శాఖ చేసినప్పటికీ ప్రకృతి కరుణించకపోవటం ప్రతికూలంగా మారింది.



మరోవైపు మరమ్మతులు

జలాశయం కుడి, ఎడమ కాలువ హెడ్‌స్లూయిస్‌లను మార్చే పనులు కొద్దిరోజులుగా జరుగుతున్నాయి. వీటి నిర్వహణకు రూ.40 లక్షలు మంజూరవగా పనులు పూర్తి చేసేందుకు మరో 20 రోజుల వరకు పట్టే వీలుంది. ఒకవేళ వరుణుడు కరుణించినా ఇప్పటికప్పుడు నార్లు పోసుకునేందుకు నీటిని విడుదల సైతం చేసే వీలులేదు. హెడ్‌స్లూయిస్ పనులు పూర్తయ్యేందుకు జులై మొదటి రెండో వారం వరకు ఆగాల్సి వస్తుందని అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాల్వల వద్ద రింగుబండ్ పనులు జరుగుతున్నాయి. దీనివల్ల హెడ్‌స్లూయిస్ వరకు నీటిని రాకుండా ఆపుతున్నారు. ప్రస్తుతం కొత్త లాకులు తెప్పించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

# పరిశోధనలకు సాన.. విత్తనోత్పత్తి భళా..!



మధిర : ఒక కొత్త వంగడాన్ని రూపొందించి విడుదల చేయటానికి 15 ఏళ్ల పాటు శాస్త్రవేత్తలు శ్రమించాలి. అలాంటి వంగడాలనెన్నో సృష్టించిన ఘనత మధిర వ్యవసాయ పరిశోధన స్థానానికి దక్కింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు సాగిస్తూ.. కొత్త వంగడాలు సృష్టిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోంది. తొలినాళ్లలో పొగాకుకు పరిమితమైన పరిశోధనలు తరువాత జొన్న, అపరాలకు విస్తరించాయి. పదేళ్లుగా అధిక విత్తనోత్పత్తి సాధిస్తూ మధిర వ్యవసాయ పరిశోధన స్థానం తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయినిగా మారింది. 1945లో 17.26 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఏర్పాటైంది. 1960 వరకు పొగాకుపై పరిశోధనలు జరిగాయి. 1960-61లో మాగీ జొన్నపై పరిశోధించారు. ఈ రకాన్ని రైతులు ఆగస్టులో విత్తుకుంటారు. 1971 నుంచి అపరాలు ఎంఆర్‌జీ (మధిర కంది రకం), ఎంజీజీ (మధిర పెసర రకం), ఎంబీజీ (మధిర మినుము రకం) మీద పరిశోధనలు జరుగుతున్నాయి. 2014 నుంచి ఇక్కడ తయారవుతున్న కొత్త వంగడాలు తెలంగాణ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడులు సాధించే రకాలను అధికారులు సృష్టిస్తుండటం విశేషం.

నిరంతర పరిశోధనలు

కేంద్రంలో నలుగురు శాస్త్రవేత్తలున్నారు. ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి పర్యవేక్షణలో నిరంతరం పరిశోధనలు సాగుతున్నాయి. ఇద్దరు బ్రీడర్, ఒకరు కీటక శాస్త్రవేత్తతో పాటు నలుగురు ఏఈఓలు, ఒక ఏఓ, ఆఫీస్ సిబ్బంది- ఇద్దరు, 34 మంది టైంస్కేలు వర్కర్లు పనిచేస్తున్నారు. పరిశోధన స్థానానికి అనుబంధంగా సాంకేతిక కళాశాలను 2013లో ఏర్పాటు చేశారు. ఇక్కడి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తూనే కళాశాలలో బోధిస్తున్నారు.

నూతన వంగడాల సృష్టి

జొన్న: మోతీ, కిన్నెర రకాల వంగడాలు సృష్టించారు. ఇవి ప్రాచుర్యం పొందాయి. వీటిని జొన్నరొట్టెలు, పశుగ్రాసం కోసం వినియోగిస్తున్నారు.


కంది: ఎంఆర్‌జీ 66, ఎంఆర్‌జీ 1004 మధ్యకాలిక రకాలు. ఇవి మ్యాక్రోఫోమినా ఎండుతెగులును తట్టుకుంటాయి.

పచ్చపెసర: ఐదు రకాలు విడుదల చేశారు. ఎంజీజీ 295, ఎంజీజీ 347 (మధిర పెసర), ఎంజీజీ 348(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), ఎంజీజీ 385(మధిర పెసర01) రకాలు.

మినుము: ఎంబీజీ 207, ఎంబీజీ 1070 రకాలు విడుదల చేశారు. చీడపీడలు తట్టుకొని అధిక దిగుబడులు ఇచ్చే పెసర, మినుము రకాలు రూపొందించారు. అధిక మొత్తంలో నూతన వంగడాలను ఉత్పత్తి చేసి టీఎస్ఎస్‌డీసీ, నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు అందజేస్తుంటారు.

నాణ్యమైన విత్తనోత్పత్తి ద్వారా పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యం. ఎంజీజీ 453, ఎంజీజీ 519, ఎంబీజీ 1110, ఎంబీజీ 1133 రకాలు పరీక్షలు పూర్తిచేసుకొని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఎంజీజీ 389, ఎంబీజీ 1080 రకాలకు రెండో ఏడాది చిరు సంచుల రూపంలో పరీక్షలు జరుగుతున్నాయి. డాక్టర్ కె.రుక్మిణీదేవి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త

# నైనీ బ్లాకుకు రైల్వే సైడింగ్ నిర్మాణం



కొత్తగూడెం : ఒడిశా రాష్ట్రం అంగోల్ జిల్లాలోనున్న నైనీ బ్లాకులో ఉత్పత్తయ్యే బొగ్గు రవాణా చర్యలపై సింగరేణి యాజమాన్యం దృష్టిపెట్టింది. కొంతదూరం రైల్వే మార్గం ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. నైనీ బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ బ్లాకుకు ప్రత్యేక ప్రాజెక్టు అధికారిని నియమించి యాజమాన్యం కొంతకాలంగా ఉత్పత్తికి సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నుంచి బొగ్గు వెలికితీయనుంది. కోల్‌బ్లాకులో 340 మిలియన్ టన్నుల నిక్షేపాలుండగా.. ఏటా 100 లక్షల టన్నులు ఉత్పత్తి చేయనున్నారు. గని జీవిత కాలం 38 ఏళ్లుగా నిర్ధారించారు.

బ్లాకు ప్రారంభమైతే కొన్నాళ్లు బొగ్గును రోడ్డు రవాణా ద్వారా ఉత్పత్తి చేసేందుకు సింగరేణి సన్నాహాలు చేస్తోంది. కానీ దీర్ఘకాలంలో ఈ రవాణా అత్యంత వ్యయంతో కూడుకున్నది కావడంతో శాశ్వత రైల్వే లైన్ అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలోని తమ గనులకు కోలిండియా సంస్థలు ఏర్పాటు చేసుకోనున్న రైల్వే మార్గాన్ని వినియోగించుకునేందుకు సింగరేణి సన్నాహాలు చేస్తోంది. నైనీ బ్లాకు మీదుగానే కొద్దిదూరంలో కోలిండియాకు చెందిన కంపెనీలు తమ గనులకు రైలుమార్గాన్ని నిర్మించతలపెట్టాయి. అక్కడి వరకు రైల్వే సైడింగ్ పనులను చేపట్టేందుకు తాజాగా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకోసం రైల్వే బోర్డు అనుమతి తీసుకోవాలి. అనుమతి లభిస్తే నైనీ బ్లాకులో ఉత్పత్తయ్యే బొగ్గును రైల్వే మార్గం ద్వారా రవాణాకు వీలుకలుగుతుంది.

కొత్తమార్గానికి రైల్వేశాఖ పచ్చజెండా

ఒడిశా రాష్ట్రం అంగోల్ జిల్లాలోని తాల్చేరు కోల్‌ఫీల్డ్స్‌లో కేంద్రం సింగరేణితో పాటు కోలిండియాకు చెందిన మరో నాలుగు సంస్థలకు బొగ్గు బ్లాకులను కేటాయించింది. వీటిలో మహానది కోల్‌ఫీల్డ్స్, నేషనల్ అల్యూమినియం కార్పొరేషన్(నాల్కో), ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ), ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిశా (ఇడ్కో) ఉన్నాయి. ఆ సంస్థలు రైలు మార్గం నిర్మాణం విషయమై కేంద్రంతో సంప్రదింపులు జరిపాయి. అంగోల్ వరకు ఉన్న రైలు మార్గాన్ని తమ బొగ్గు బ్లాకుల గుండా పొడిగించాలన్న విజ్ఞప్తికి కేంద్ర రైల్వే శాఖ అంగీకరించింది. కొత్త మార్గంలో బలరాం, తెంతులోయి, జార్పాండా వరకు రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రైల్వే లైన్‌ను జార్పాండాకు కొద్ది దూరంలోనే ఉన్న నైనీ బొగ్గు బ్లాకు వరకు పొడిగించాల్సిందిగా సింగరేణి సైతం రైల్వే శాఖను కోరింది. కానీ అందుకు రైల్వేశాఖ అంగీకరించకపోవడంతో కొద్దిదూరం మేర సొంతంగా రైల్వే సైడింగ్ నిర్మాణ పనులు చేపట్టాలని యాజమాన్యం నిర్ణయించింది. జాయింట్ వెంచర్‌గా ఏర్పడి రైల్వే లైనును సాధించుకున్న మిగతా కంపెనీలు సింగరేణితో కలిసేందుకు నిరాకరించాయి. భాగస్వామిగా కాకుండా రైల్వే రవాణా ఛార్జీల చెల్లింపు పద్ధతిపై జాయింట్ వెంచర్ మార్గం సేవలను వినియోగించుకునేందుకు సింగరేణి నిర్ణయం తీసుకుంది. ఈలోగా సొంత వ్యయంతో రైల్వే సైడింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

# తాలిపేరు.. నిర్వహణ మరిచారు!


కొత్తగూడెం : వేసవిలో చేపట్టాల్సిన ప్రాజెక్టు నిర్వహణ (మెయింటెనెన్స్) పనులను అధికారులు పట్టించుకోలేదు. ఏటా మే నెలలో ప్రాజెక్టు నిర్వహణ పనులు పూర్తిచేసి ఖరీఫ్‌కు ముందే సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలి. గేట్ల ఆపరేషన్, గ్రీజింగ్, మెకానికల్, విద్యుద్దీకరణ, ఇతరత్రా సవ్యంగా ఉండేలా మరమ్మతులు చేపట్టాలి. తొలకరి పలకరింపునకు వేళయినా ఇప్పటికీ చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నిర్వహణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. 25 గేట్ల ఆపరేషన్‌కు సంబంధించి రోప్ ఆయిలింగ్, గ్రీజింగ్, బేరింగ్, మోటర్ మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్రాజెక్టు గేట్లు ఎత్తలేదు. గేట్ల పనితీరునూ పరిశీలించలేదు.

మెకానిక్ పనులకు మోక్షమేదీ?

ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లకు సంబంధించిన బ్రేకర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఏటా వరదల సమయంలో గేట్లు ఎత్తేందుకు సిబ్బందికి తంటాలు తప్పటం లేదు. ప్రాజెక్టుకు ఇటీవల కొత్త 125 కేవీఏ జనరేటర్ సమకూర్చారు. స్టాండ్‌బైగా ఉన్న 35 కేవీఏ జనరేటర్‌కు మరమ్మతులు, క్రషర్ గేట్ల బేరింగ్, వెల్డింగ్ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. గ్యాలరీలో లీకేజీలను అరికట్టే గ్రౌటింగ్ పనులకు ఏళ్ల తరబడి మోక్షం లభించటం లేదు.

హెడ్ రెగ్యులేటర్ గేట్లు, ఈఎం బ్రేక్స్ మారేనా..!

ప్రాజెక్టు ప్రధాన ఎడమ, కుడి కాల్వల హెడ్ రెగ్యులేటర్ల గేట్లు సవ్యంగా పనిచేయటం లేదు. ప్రధాన కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్ షట్టర్లను మార్చాలి. గేట్లు లేవకపోవటంతో నీటి విడుదల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టు 25 గేట్లకు సంబంధించిన ఈఎం (ఎలక్ట్రో మ్యాగ్నటిక్) బ్రేక్స్ కొన్నేళ్లుగా పనిచేయటం లేదు. ఏటా వరదల సందర్భంలో గేట్లు



ఎత్తేందుకు సిబ్బంది తంటాలు పడుతున్నారు. ఎగువ నుంచి ఎప్పుడు భారీగా వరద వస్తుందో తెలియక.. ఈఎం బ్రేక్స్ పనిచేయక.. కట్టెలు అడ్డంగా పెట్టి సిబ్బంది గేట్లు ఎత్తాల్సిన దుస్థితి దాపురించింది. వాటి నిర్వహణ మరింత క్లిష్టంగా మారుతోంది.


కాల్వలకు సంబంధించి ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులు జరుగుతున్నాయి. జనవరి, ఫిబ్రవరిలోనే గ్రీజింగ్ చేశాం. పుల్లీ బేరింగ్‌లు అమర్చుతాం. ప్రధాన ఎడమ, కుడికాల్వల హెడ్ రెగ్యులేటర్ల షట్టర్లు నుంచి నీరు లీకవుతోంది. వాటి స్థానంలో కొత్తగా షట్టర్ల ఏర్పాటు ప్రక్రియను వారంలో ప్రారంభిస్తాం. నిర్వహణ పనుల్లో భాగంగా గతంలోనే రోప్ ఆయిలింగ్ చేశాం. లిమిట్ స్విచ్‌లు, ఈఎం బ్రేక్స్‌ను త్వరలోనే అమర్చుతాం. తిరుపతి, డీఈ

# సోమేశ్వరాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యం

వరంగల్ : రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో పాలకుర్తిలోని సోమేశ్వరాలయం ఒకటి. ఇక్కడి క్షీరాద్రిపై సోమేశ్వరుడు, లక్ష్మీనరసింహస్వామి స్వయంభువులుగా వెలిశారు. అంతేకాక పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఈ ఆలయ పరిసరాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కానీ సోమేశ్వరాలయంలో దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఆలయంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సిబ్బంది వ్యవహరిస్తుంటారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విధుల్లో నిర్లక్ష్య ధోరణి

ఆలయంలో పనిచేసే కొందరు సిబ్బంది, అర్చకులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు విధులకు రాకుండానే రిజిస్టర్‌లో సంతకాలు చేస్తారని, మరికొందరు ఎలాంటి సమాచారం లేకుండానే విధులకు గైర్హాజరవుతారు. ఓ ఉద్యోగి ముందస్తు సమాచారం లేకుండా కొన్ని రోజులు విధులకు రాలేదు. దీంతో ఈవో లక్ష్మీప్రసన్న నోటీసులు జారీ చేశారు. ఉద్యోగి నుంచి వివరణ రాకపోవడంతో సస్పెండ్ చేశారు. అర్చకులు సైతం సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారి స్థానంలో ఇతరులను విధుల్లో ఉంచుతారని,



నిత్య పూజల విషయంలోనూ జాప్యం చేస్తుంటారని తెలిసింది. ఆలయాన్ని తెరవడం, మూసివేయడంలోనూ కాలయాపన చేస్తుంటారని సమాచారం. ఆలయంలో మొత్తం సిబ్బంది సుమారు 26 మంది ఉన్నారు. వాహనాలను కూడా క్షీరాద్రిపై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుంటారు.

జాతరకు రెట్టింపు ఖర్చులు

సోమేశ్వరాలయంలో ఏటా మహాశివరాత్రి జాతరను వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిసారీ జాతరకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు చేస్తారు. ఈసారి ఆయా ఖర్చులు రెట్టింపయ్యాయి. సుమారు రూ.20 లక్షలకు పైగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఓ ఉన్నతాధికారి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే ఖర్చులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అధికారులు వాపోయారు. చండికా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సైతం భారీగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

గణనీయంగా అభివృద్ధి

అభివృద్ధిపరంగా సోమేశ్వరాలయ రూపురేఖలు మారాయి. గర్భగుడితో పాటు క్షీరాద్రి ఆలయ ప్రాంగణం, మెట్ల సుందరీకరణ, కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేశారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఈ పనులు చేపట్టారు. ప్రభుత్వం వీటికి అదనపు నిధులు సైతం కేటాయించింది. కొందరు అధికారులు, అర్చకులు ఆలయంలో అవసరం లేని పనులు చేయించారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. బుకింగ్ కేంద్రాన్ని ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. నవగ్రహాలను రక్షణ లేదని భక్తులు చెబుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు- లక్ష్మీప్రసన్న, ఈవో, సోమేశ్వరాలయంఅధికారులు, సిబ్బంది, అర్చకులు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ఇటీవల ఈ విషయంలో ఉద్యోగిని కూడా తప్పించాను. ఎవరి విధులు వారు నిర్వహించాల్సిందే. సీసీ కెమెరాల దృశ్యాల ద్వారా నిత్యం ఆలయంలో జరిగే కార్యక్రమాలు, చర్యలను పర్యవేక్షిస్తుంటా.

# నగరంలో ఇక మురుగు కంపే!

వరంగల్ : స్మార్ట్‌సిటీ పథకంలో ప్రతిపాదించిన కీలకమైన ప్రాజెక్టులు ఒక్కొక్కటి చేజారుతున్నాయి. భవిష్యత్తు అవసరాల కోసం ప్రతిపాదించిన ముఖ్యమైన పనులు పక్కకు నెట్టేస్తున్నారు. ఇప్పటికే ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుకు రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) మరుగున పడ్డాయి. తాజాగా హనుమకొండ రెడ్డిపురం చెరువు వద్ద ప్రతిపాదించిన రోజుకు 100 మిలియన్ లీటర్ల మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రం(ఎస్టీపీ) పనులు రద్దు చేశారు. సుమారు రూ.200 కోట్లతో టెండర్లు పిలిచినప్పటికీ స్థలాలు లభించడం లేదంటూ పక్కకుపెట్టేశారు. ఇప్పటికే డంపింగ్ యార్డులోని చెత్తతో కంపు కొడుతున్న నగరానికి మురుగు కూడా తోడవనుంది.

స్మార్ట్‌సిటీ పథకంలో మురుగునీటి శుద్ధీకరణ అంశం కీలకం. రెడ్డిపురంలో 100 ఎంఎల్‌డీలు, కాజీపేట బంధం చెరువు వద్ద 15 ఎంఎల్‌డీలు, ఉర్సు చెరువు వద్ద 5 ఎంఎల్‌డీల ఎస్టీపీలు డిజైన్ చేశారు. కాజీపేట, ఉర్సు చెరువు వద్ద నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రద్దు చేసిన రెడ్డిపురం ప్రాజెక్టు నిధులను ప్రజాప్రతిధులు సూచించిన దగ్గర కొత్తగా ప్రతిపాదించారని తెలిసింది. ఆధునిక, సాంకేతిక ప్రాజెక్టులు అమలయ్యేలా చూడాల్సిన ప్రాజెక్టు మానిటరింగ్ కమిటీ (పీఎంసీ) నిపుణులు ఏమీ పట్టనట్లుగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

చెరువులు కలుషితం

వరంగల్ త్రినగరి నుంచి వెలువడుతున్న మురుగునీటితో ఇప్పటికే చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. నగర శివారులోని నాగారం, రెడ్డిపురం, ములుగురోడ్ కోట చెరువు, దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువులను మురుగు ముంచెత్తుతోంది. సమీపంలో ఉన్న కాలనీల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. బోర్లు, మంచినీటి బావుల్లో రంగు మారిన నీళ్లు వస్తున్నాయని స్థానిక ప్రజలంటున్నారు. రంగశాయిపేట బెస్తం చెరువు, మద్దెలకుంట, న్యూశాయంపేట కోటి చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులకు మురుగు చేరుతోంది.

నగరంలో వెలువడే మురుగులో ఎక్కువ శాతం నాగారం చెరువులోకి వెళ్తాయి. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని నిపుణుల కమిటీ హెచ్చరించింది. చెరువులు, కుంటలు కలుషితం కాకుండా చూడాల్సిన గ్రేటర్ వరంగల్ పాలకులు పట్టింపు లేకుండా ఉంటున్నారు.

రోజూ 120 ఎంఎల్‌డీలు

త్రినగరి నుంచి ప్రతి రోజూ 120 మిలియన్ లీటర్ల మురుగు నీరు వస్తుంటుంది. వచ్చే పదేళ్ల నాటికి 150-180 ఎంఎల్‌డీలకు చేరుకుంటుందని అంచనా. చిన్న చిన్న పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తగినన్ని మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వరంగల్‌లో చూస్తే ఈ రెండూ లేని లోటుతో ప్రజలు కంపును భరాయించాల్సి వస్తోంది.

# నిపుణుల మాట.. కొలువుకు బాట

ఆదిలాబాద్ :రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగాల కోసం అభ్యర్థులు పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలలో పోలీసు ప్రాథమిక పరీక్ష నేపథ్యంలో అభ్యర్థులు ఆందోళన వీడి.. ప్రశాంతంగా పరీక్ష రాయాలని నిపుణులు సూచిస్తున్నారు. బీసీ స్టడీ సర్కిల్లో ప్రస్తుతం కొనసాగుతున్న గ్రూప్-1, కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల శిక్షణలో అభ్యర్థులను కొలువు సాధించే దిశగా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం శిక్షణలో ఉన్న 400 మందికి మరో పది రోజుల్లో శిక్షణ తరగతులు ముగుస్తాయి. వచ్చే నెలలో గ్రూప్ 2, 3, 4, టీఆర్టీ, టీచర్, గురుకులం టీచర్ ఉద్యోగాలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి. దాదాపు 600 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. బీసీ స్టడీ సర్కిల్లో పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా 20 సూత్రాలతో కూడిన సూచికను సైతం ఏర్పాటు చేశారు. పరీక్ష సమయం దగ్గర పడుతుండటంతో ఏ అంశాలపై శ్రద్ధ వహించి ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై నిపుణుల మాటల్లోనే..

అవగాహన చేసుకోవాలి– దేవేందర్‌రావు, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు ప్రభుత్వ మహిళా కళాశాల ఆదిలాబాద్

మొదట ప్రతి విషయంపై అవగాహన చేసుకోవాలి. ప్రామాణిక పాఠ్య పుస్తకాలు చదవాలి. చదివేటప్పుడు ముఖ్య అంశాలను గుర్తుంచుకోవాలి. పరీక్ష సమయం కంటే వారం ముందు ముఖ్యంశాలు, అంతర్గత అంశాలను పాయింట్ల రూపంలో సంక్షిప్తంగా రాసుకోవాలి. అదే విధంగా పఠనం చేయాలి. కచ్చితంగా అన్వయింపు అభ్యాసం, పాత పరీక్ష ప్రశ్న పత్రాలను పరిష్కరించడం అభ్యాసం చేయాలి. పాత పరీక్ష పేపర్లను చదవకపోతే అభ్యర్థుల్లో భయం ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 15 నిమిషాల పాటు శాస్త్రీయ సంగీతం వినాలి. దీనివల్ల భయం పోతుంది. మనసుకు ఊరట లభిస్తుంది.

పునశ్చరణ ముఖ్యం– డి.లక్ష్మీనరసింహం, ప్రధాన ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్

అభ్యర్థులు తయారు చేసుకున్న నోట్స్ పునశ్చరణ చేయాలి. వీలైనన్ని నమూనా పరీక్షలు రాసి ఏ విభాగంలో మార్కులు తగ్గుతున్నాయో గమనించి ఆ విభాగాన్ని మళ్లీ చదవాలి. తెలంగాణ ఉద్యమం, సంస్కృతి, చరిత్ర, తెలంగాణ ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి



సారించాలి. గత తొమ్మిది నెలల వర్తమాన అంశాలను అధ్యయనం చేయాలి. ఇక చివరగా అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షకు హాజరుకావాలి. చదివింది గుర్తుండాలంటే సిలబస్‌లోని విభాగాల నుంచి ముఖ్యంశాలు రాసుకొని వాటిని పదేపదే చదవడం ద్వారా గుర్తుంచుకోవచ్చు భౌగోలిక శాస్త్రం లాంటి అంశాలను అధ్యయనం చేసేటప్పుడు అట్లాస్‌ను దగ్గర ఉంచుకొని చదవడం ద్వారా సులభంగా గుర్తుంచుకోవచ్చు.

దినపత్రికలను చదవాలి– రోషిరెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

అభ్యర్థులు సంబంధిత సిలబస్‌పై పూర్తి పట్టు సాధించి ఆ అంశాలపై సొంత నోట్స్ తయారు చేసుకోవాలి. ప్రతి నిత్యం దినపత్రికలను చదవాలి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ, అంశాలతో పాటుగా రాజకీయ, ఆర్థిక పరమైన ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్న వివిధ వనరులపై పూర్తి పట్టు సాధించాలి. ఈ మధ్య కాలంలో జరిగే పరిణామాలు వాటిపై వచ్చిన వ్యాసాలను పూర్తి స్థాయిలో చదవాలి. ప్రశ్న పత్రంలో ఒక అభ్యర్థిగా భాషపై పట్టు సాధించాలంటే ప్రచురణ భాష తెలిసి ఉండాలి. అలాంటప్పుడే వ్యాస ప్రశ్నలకు జవాబులు దిద్దేవారిని ఆకట్టుకుంటాయి. మంచి మార్కులు సాధించవచ్చు అభ్యర్థులు మానసిక ప్రశాంతత కోసం రోజూ యోగా, వ్యాయామం సాధన చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చు.

నమూనా పరీక్షలతో ఉపయుక్తం– ప్రవీణ్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, ఆదిలాబాద్

అభ్యర్థులు చదివే సిలబస్ ఏరోజు పూర్తి అవుతుందో అదేరోజు నమూనా పరీక్ష రాయాలి. దీని వల్ల అభ్యర్థి సమర్థత తెలిసి భయంపోతుంది. పరీక్ష సమయం కంటే పదిరోజుల ముందునుంచి రోజూ రెండు నమూనా పరీక్షలు పూర్తి సిలబస్‌పైన రాయాలి. గతంలో జరిగిన కానిస్టేబుల్, ఎస్ఐ పరీక్ష పేపర్‌లను మళ్లీ రాయాలి. ప్రతిరోజు వార్త పత్రికలో వచ్చే అంశాలను నోట్ చేసుకోవాలి. కఠినమైన విషయాలను అభ్యర్థులు ఉమ్మడిగా కలిసి చదవాలి. స్టడీ సర్కిల్లో పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి 20 సూత్రాలతో కూడిన ప్రత్యేక సూచికను తెలుగు, ఆంగ్ల భాషలో ఏర్పాటు చేశాం. కానిస్టేబుల్, ఎస్ఐ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు ప్రధానంగా అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలను గుర్తుంచుకోవడానికి సులభమైన మార్గాన్ని ఎంచుకోవాలి.


పాత ప్రశ్నపత్రాలు చూసుకోవాలి– ఎస్.విజయబాబు, విశ్రాంత అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ, పీజీ, కళాశాల ఆదిలాబాద్

పాత ప్రశ్నపత్రాలను చూసుకోవాలి. ముఖ్యమైన అంశాలను ఎన్నుకొని వాటిని చదవాలి. అన్ని విషయాలను సమయపాలన ప్రకారంగా చదవాలి. సాయంత్రం ఒకగంట విశ్రాంతి తీసుకోవాలి. ధ్యానం, పాటలు వినడం, యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. పరీక్ష కేంద్రానికి వెళ్లేటప్పుడు ఎలాంటి భయాందోళన ఉండకూడదు. భయం వల్ల నష్టం జరగవచ్చు పరీక్ష రాసే సమయంలో నిశ్చింతంగా రాయాలి.

## అరకొరగా డీఏపీ సరఫరా

ఖమ్మం : జిల్లాలో డీఏపీ కొరతతో రైతులు దిగులు చెందుతున్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో ఐపీఎల్ కంపెనీకి చెందిన ఎర్ర పొటాష్ సరఫరా కూడా చాలా వరకు నిలిచిపోయింది. దీంతో కొద్దికొద్దిగా వస్తున్న తెల్ల పొటాష్‌ను రైతులు ఉపయోగిస్తున్నారు. అవసరాల మేరకు ఆయా కంపెనీలు ఎరువును సక్రమంగా సరఫరా చేయకుండా తాత్సారం చేస్తుండటంతో పలు ప్రాంతాల్లో రైతులు డీఏపీ దొరక్క ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవటంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి. ఇప్పుడు పత్తి, పెసర, వరి, మొక్కజొన్న, చెరకు వంటి పంటలకు వేసేందుకు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు.లింకు మందులతో విక్రయాలుకేంద్ర ప్రభుత్వం డీఏపీ 50కిలోల బస్తా ఒక్కింటికి రూ.2,500 పైగా రాయితీ ప్రకటించి ఈ మొత్తాన్ని ఆయా కంపెనీలకు చెల్లిస్తోంది. కొరత రాకుండా అన్నదాతలకు రూ.1350 చొప్పున సరఫరా చేయాలని ఆదేశించింది. కానీ, ఉత్పత్తి వ్యయం పెరిగి తమకు నష్టాలు వస్తున్నాయని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతూ, డీఏపీతో లింకు మందులను ముడిపెట్టి తమకు అంటగడుతున్నాయని రిటైల్ డీలర్ల సంఘాలు ఇటీవల కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖకు ఫిర్యాదు చేశాయి.

# పోషకాలు అందేనా..!



మహబూబాబాద్: ఇక్కడ డిజిటల్ కాంటాలో 40 గ్రాములు, 60 గ్రాములతో కనిపిస్తున్న కోడిగుడ్డు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసేది. జిల్లా కేంద్రంలోని ఒక అంగన్‌వాడీ కేంద్రానికి పంపిణీ చేసిన గుడ్లను పరిశీలిస్తే కొన్నింటి పరిమాణం చిన్నవిగా..మరికొన్ని పెద్దవిగా ఉన్నాయి. ఇలాంటి సరఫరా చేస్తే పోషకాలు సమపాళ్లలో ఎలా అందుతాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ విషయంలో పాలకులే బదులివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం 7 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు, గర్భిణులు, బాలింతలకు 50 గ్రాముల బరువు ఉండే కోడిగుడ్డును అందించాలి. 40 నుంచి 45 గ్రాములు, కొన్నిచోట్ల 49 గ్రాముల బరువున్న గుడ్లను అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు పోషకాహారం సమపాళ్లలో అందడం లేదు. గుత్తేదారులు వారి స్వప్రయోజనం కోసం తక్కువ పరిమాణం ఉన్నవాటిని సరఫరా చేయడమే ఇందుకు కారణం. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసిన 'మాములు'గా తీసుకుంటున్నారు. గుత్తేదారులు కావాలనే పౌల్ట్రీల నుంచి ఈ విధమైన గుడ్లను తెస్తున్నట్లు సమాచారం.

సుమారు 7 లక్షల గుడ్ల సరఫరా

జిల్లాలోని 1,437 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి నెల రూ. 30-40 లక్షల ఖరీదైన 5-7 లక్షల కోడిగుడ్లను గుత్తేదారులు సరఫరా చేస్తున్నారు. రోజూ నెక్ ధర ఎంత ఉంటుందో నెల రోజులకు సగటున లెక్కగట్టి సొమ్ము చెల్లిస్తారు. దీనికి తోడూ కిలో మీటరుకు 70 నుంచి 85 పైసల చొప్పున రవాణా ఛార్జీలు కూడా లెక్కగట్టి ఇస్తారు. చెల్లిస్తున్న ధరకు తగినట్లుగా, నిబంధనల ప్రకారం బరువు ఉండాల్సిన గుడ్లు సరఫరా కావడం లేదు.

పరిశీలించి పరిష్కారిస్తాం - నర్మద, ఇన్‌ఛార్జి డీబ్ల్యూవో, మహబూబాబాద్

ఈ విషయం మా దృష్టికి రాలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి సరఫరా చేసిన గుడ్లను పరిశీలిస్తాం. నిబంధనల ప్రకారం గుడ్డు పరిమాణం ఉండేలా తగిన చర్యలు తీసుకుంటాం.

కిలోన్నర ఉండాలి

గుత్తేదారులు కేంద్రాలకు కోడిగుడ్లను తీసుకొచ్చినప్పుడు 30 గుడ్లతో కూడిన ట్రేను తూకం వేస్తారు. ఒక్కో ట్రే కిలోన్నరకు తగ్గకూడదు. ఈ లెక్కన గుడ్డు 50 గ్రాములు ఉంటే 30 గుడ్ల ట్రే కిలోన్నర ఉండాలి.. 60 గ్రాముల బరువు ఉంటే కిలో 800 గ్రాములుండాలి. కేంద్రాలకు సరఫరా చేస్తున్న ట్రేలో కొన్ని చిన్నవి, ఇంకొన్ని పెద్దవిగా ఉంటున్నాయి. దాంతో కిలో 200, కిలో 300 గ్రాముల చొప్పున ఉంటున్నట్లు కొంత మంది నిర్వహకులు వాపోతున్నారు.

నెలకు రెండు సార్లు

అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను నెలకు రెండుసార్లు సరఫరా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి అందడం లేదు. నిబంధనల ప్రకారం పలువురు లబ్ధిదారులకు ఇవ్వాల్సిన వాటి కంటే తక్కువగా ఇస్తున్నారు. నిబంధనల ప్రకారమే సరకులు పంపిణీ చేస్తున్నట్లు నమోదు చేస్తున్నా కొన్ని కేంద్రాల్లో చాలా మంది లబ్ధిదారులు బలహీనంగా ఉన్నట్లు సమాచారం.

# ఏది..స్థలమేది?




మణుగూరు : భద్రాద్రి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమయ్యే శాశ్వత భవనాలు లేవు. నూతన భవనాల నిర్మాణానికి స్థలాల కొరత తీవ్రంగా ఉంది. భవనాల ఏర్పాటుకు అనువైన స్థలాలు లేక కొన్నింటిని అద్దె భవనాల్లో కొనసాగిస్తుండగా, మరికొన్ని ఇతర ప్రాంతాలకు తరలించారు. అయిదు నియోజకవర్గాల్లో కూడా ఇదే సమస్య. ప్రభుత్వ భూమికన్నా అటవీ, ప్రైవేటు భూమి ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ అవసరాల కొరకు అనువైన స్థలాలు దొరకటం లేదు. దీంతో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గతంలో ప్రభుత్వం పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు పూర్తి స్థాయిలో లభించక, అటవీ భూముల్లో కూడా వాటిని ఏర్పాటు చేశారు. గతంలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు, బాలికల కళాశాలలు మణుగూరుకు మంజూరయ్యాయి. అయితే కళాశాలల నిర్వహణకు భవనాలు లేక బాలుర కళాశాలను పాల్వంచ, బాలికల కళాశాలను భద్రాచలం తరలించారు. అదేవిధంగా గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను భద్రాచలం తరలించారు. అశ్వాపురం మండలంలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు స్థలం లభించక పామాయిల్ కార్మాగారం ఏర్పాటుకు ప్రతిపాదించిన భూమిని నవోదయకు కేటాయించారు. మణుగూరుకి నూతనంగా మంజూరు చేసిన రవాణా శాఖ కార్యాలయానికి స్థలం దొరకటం కష్టంగా ఉంది. ఇల్లెందులో మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల రెండూ ఒకే భవనంలో కొనసాగిస్తున్నారు. స్థలాలు, భవనాల కొరతతో సింగరేణికి చెందిన భవనంలో నిర్వహిస్తున్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఏర్పాటుకు శాశ్వత భవన, స్థలం లేక కారేపల్లికి తరలించారు. ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం మండలం ఎటపాకకు ప్రతిభ పాఠశాల, కళాశాల మంజూరవ్వగా, తెలంగాణ ఏర్పడిన తరువాత దాన్ని భద్రాచలంలో కొనసాగించాల్సి ఉంది. అయితే స్థలం, భవనం లభించక ఖమ్మం తరలించారు. ఇప్పటికీ కూడా ప్రతిభ పాఠశాల ఖమ్మంలోనే నిర్వహిస్తున్నారు. భద్రాచలం పట్టణానికి డంపింగ్ యార్డు స్థలం లేదు. యార్డుకు అనువైన స్థలం దొరక్కపోవటంతో చెత్తను గోదావరి కరకట్ట సమీపంలో డంప్ చేస్తున్నారు. దమ్మపేట మండలం అంకంపాలెంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలకు భవనం సరిపోక, అశ్వారావుపేట పెదవాగు ప్రాజెక్టు వద్దకు తరలించారు. బీసీ బాలురు, బాలికల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అబ్కారీ శాఖకు కేటాయించిన స్థలంలో ఇప్పటివరకు భవనం నిర్మించక అద్దె భవనంలో కొనసాగుతుంది.

పాల్వంచలో అనువైన భవనం లేక ఏకలవ్య పాఠశాలను రామవరంలో నిర్వహిస్తున్నారు.

పరిశ్రమల సహకారంప్రభుత్వ శాఖల కోసం, పాఠశాలలు, కళాశాలలు నిర్వహించేందుకు భవనాలు లభించకపోయినా స్థానికంగా ఉండే పరిశ్రమల నుంచి కొంత తాత్కాలికంగా సహకారం లభిస్తుంది. కొత్తగూడెంలో కొన్ని శాఖల కార్యాలయాలు ఇప్పటికీ సింగరేణికి చెందిన భవనాల్లో కొనసాగుతున్నాయి. మణుగూరు నుంచి తరలివెళ్లిన సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్ని సింగరేణికి చెందిన భవనాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు కొనసాగుతున్నాయి.

# వైద్యం మెరుగు.. పారిశుద్ధ్యం కరవు



మంచిర్యాల : గోదావరి ఉగ్రరూపం, పొంగిపొర్లిన వాగులతో జిల్లాకేంద్రంలోని పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా మంచిర్యాల పట్టణానికి వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ప్రధాన కాలనీలైన రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, గణేష్‌నగర్, ఎన్టీఆర్ నగర్‌లోని నివాసితులు కోలుకోవాలంటే కొన్ని ఏళ్లు పట్టే పరిస్థితి ఏర్పడింది. వరదలు వచ్చి వెళ్లిన చోట పారిశుద్ధ్య లోపం తీవ్రంగా కనిపిస్తోంది. ఇప్పటికే బురదమయమైన నివాసాలను శుభ్రం చేసుకునేందుకు యజమానులు తల్లడిల్లుతుంటే కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో పురపాలిక నిర్లక్ష్యం చేస్తోంది. వ్యాధి బారినపడిన తర్వాత చికిత్స అందించేందుకు వైద్యారోగ్యశాఖ సిద్ధంగా ఉన్నా వీటిని సోకకుండా చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించడంలో పురపాలిక వెనుకబడిపోయింది.

వ్యాధుల నివారణ చర్యలపై పురపాలిక నిర్లక్ష్యం

వర్షాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడంలో పురపాలక సంఘం అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారు. నివాస గృహాల మధ్య గల ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికీ క్రిమి కీటకాల నివారణకు వీధుల్లో బ్లీచింగ్ పౌడర్, రసాయన మందులు చల్లలేదు. ఫాగింగ్ చేయలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీటి మునిగాయి. ప్రస్తుతం అక్కడ పరిశుభ్రత పనులు చేస్తున్నారు.పట్టణంలోని 36 వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేయడానికి 307 మంది కార్మికులు ఉన్నారు. ఒక్కొక్క వార్డుకు ఆరు నుంచి పది మందిని కేటాయించారు. వీరు రోజు వెలుబడే చెత్తను తొలగించడానికే సరిపోతున్నారు. పట్టణంలో వరదనీరు, మురుగునీరు నిలిచిన చోట ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నా పట్టించుకోవడం లేదు. వీటి నివారణకు వీధుల్లో చల్లడానికి బ్లీచింగ్ పౌడర్, రసాయన మందులు కూడా పురపాలక సంఘంలో అరకొరగానే ఉన్నాయి. ప్రస్తుతం 25 కిలోలవి 130 బ్లీచింగ్ పౌడర్ సంచులు, 50 కిలోలవి 220 సున్నం సంచులు ఉన్నాయి. ఇవి వరద బాధిత కాలనీల్లో చల్లడానికే సరిపోవు. మిగతా వార్డుల్లో వ్యాధుల నివారణకు రసాయన మందులు చల్లించడం ప్రశ్నార్థకంగా మారింది.

వరదలతో వచ్చిన చెత్త అంతా ఇంతా కాదు. దీనిని శుభ్రం చేసేందుకు పట్టణ పారిశుద్ధ్య సిబ్బంది ఏ మాత్రం సరిపోవడంలేదు. అయినా అధికారులు ప్రత్యామ్నాయం చేయడంలేదు.

# భూగర్భ జలాలు లోపలికి..

నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షాలు కురుస్తున్నా భూగర్భ జలాల పెరుగుదలలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. గతేడాది జూలైతో పోల్చితే ఈ ఏడాది భూగర్భ జలాలు స్వల్పంగా తగ్గాయి. గతేడాది కంటే ఈసారి జూలైలో వానలు జిల్లా సాధారణ వర్షపాతాన్ని మించి కురిసినా, భూగర్భ జలాల పెరుగుదలలో మార్పు లేదు. జిల్లాలోని 12 మండలాల్లో భూగర్భ జలాలు తగ్గగా, ఆరు మండలాల్లో స్వల్పంగా పెరిగాయి. రెండు మండలాల్లో ప్రమాదకరమైన లోతుకు చేరాయి. కానీ వర్షాలు మాత్రం రెండు మండలాలు మినహా అన్ని చోట్ల అధికంగానే కురిశాయి. వర్షాలు బాగా కురిసినా భూగర్భ జలాలు పెరుగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

లోపలికి..జిల్లా భూగర్భ జలశాఖ తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది జూలైలో వర్షా లు అధికంగా కురిసినా, భూగర్భ జలాల సగటు లభ్యత మాత్రం 0.08 మీటర్ల మేర లోతుకు చేరింది. జిల్లా సాధారణ వర్షపాతం 642.3 మిల్లీ మీటర్లు కాగా, ఈ జూలై నెలాఖరు నాటికి 221.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గత ఏడాది ఇదే



నెలలో 176.7మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అంటే గతేడాదితో పోల్చితే 45 శాతం అధిక వర్షం కురిసింది. జిల్లాలోని పెంట్లవెల్లి, పదర మండలాల్లో సాధారణం కంటే తక్కువ కురువగా.. బల్మూరు, ఉప్పునుంతల, లింగాల మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో సాధారణం కంటే 20 శాతం అధికంగా కురిసింది. జిల్లా మొత్తంగా 45 శాతం అధిక వర్షం కురిసింది. కానీ భూగర్భ జలాల విషయానికి వస్తే గతేడాది జూలైలో 6.61 మీటర్ల లోతులో లభించిన జలాలు ఈ సారి 6.69 మీటర్ల లోతుకు చేరాయి. అంటే 0.08 మీటర్లు తగ్గాయి. కురిసిన వర్షంతో పోల్చితే ఈ ఏడాది జలాలు పెరగాల్సి ఉండగా, స్వల్పంగా తగ్గడం గమనార్హం. జిల్లాలోని అచ్చంపేట, చారకొండ, కల్వకుర్తి, తాడూరు, తిమ్మాజిపేట, వంగూరు మండలాలు మినహా మిగతా మండలాల్లో 0.10 మిల్లీ మీటర్ల నుంచి 5.59 మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గాయి. భూగర్భ జలాలు లోతుకు చేరిన మండలాల్లో పదర, పెంట్లవెల్లి తప్ప మిగతా మండలాల్లో జూలై వరకు సాధారణం కంటే వర్షం అధికంగానే కురిసింది.

నాగర్‌కర్నూల్‌లో అధిక లోతుకు..ఈ ఏడాది నాగర్‌కర్నూల్ మండలంలో 38 శాతం అధికంగా వర్షం కురిసినా, భూగర్భ జలాలు మాత్రం ప్రమాదకరంగా గతేడాది కంటే 5.59 మీటర్ల మేర లోతుకు చేరాయి. నాగర్‌కర్నూల్ మండల సాధారణ వర్షపాతం 207.5 మిల్లీ మీటర్లు కాగా, జూలై వరకు 287.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గతేడాది జూలైలో 15.37 మీటర్ల లోతులో లభించిన భూగర్భ జలాలు.. ఈసారి 20.96లో లోతులో లభించడం ఆందోళన కలిగిస్తోంది.

పదేళ్లతో పోల్చితే పైనే..గతేడాదితో పోల్చితే భూగర్భ జలాల లభ్యత స్వల్పంగా లోపలికి వెళ్లినప్పటికీ, భూగర్భ జలాల లభ్యత విస్తీర్ణం పెరిగింది. అలాగే గత పదేళ్లతో పోల్చితే ఈ సారి భూగర్భ జలాల లభ్యత పెరిగింది. భూగర్భ జలాలను సంరక్షించేందుకు కురిసిన ప్రతీ వర్షపు బొట్టును ఒడిసిపట్టి పొదుపుగా వాడాలి. – రమాదేవి, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

## ఉన్నత విద్యకు దూరం

అయిజ : అయిజ మునిసిపాలిటీ పరిధి లో డిగ్రీ కళాశాల లేక బాలికలు ఉన్నత విద్యకు దూ రమవుతున్నారు. జిల్లా కేంద్రమైన గద్వాల తర్వాత స్థానంలో అన్ని రంగాల్లో అయిజ మునిసిపాలిటీ ముందుంది. కానీ డిగ్రీ కళాశాల లేకపోవడం సమస్య గా మారింది. ఇంటర్ పూర్తయిన తర్వాత ఉన్నత వి ద్యకోసం దూర ప్రాంతాలకు పంపించేందుకు కొందరు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. అందుకు అ వసరమైన ఆర్థికస్థోమత లేకపోవడం మరో కార ణమని చెప్పవచ్చు. జిల్లా కేంద్రానికి రావాల్సిందే...అయిజ మునిసిపాలిటీ, మండల పరిధిలో 2011 లెక్కల ప్రకారం 85,972 మంది జనాభా ఉంది. ప్రస్తు తం ఆ సంఖ్య లక్షకు చేరి ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. ప్రస్తుతం అయిజలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా విద్యాలయం ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఒక ఐటీఐ, రెండు ఓపెన్ ఇంటర్ కళాశాలలున్నాయి. అయిజ నుంచి శాంతినగర్ 20 కిలోమీటర్లు, గద్వాల 31 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. అయిజ మండలం లో 28 గ్రామపంచాయితీలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఇంటర్ కళాశాల పక్కనే మూడు ఎకరాల ఖాళీ స్థలం ఉంది. పైగా అయిజ పక్కనే మల్దకల్, గట్టు, రాజోలి, వడ్డేపల్లి, ఇటిక్యాల మండలాలకు చెందిన గ్రామాలున్నాయి. ఈ నేపథ్యంలో అయిజ, గట్టు మండలాలకు చెందిన విద్యార్థులు డిగ్రీ చదవాలంటే ప్రతీ రోజు రాను పోను దాదాపు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో చాలామంది విద్యార్థినులు ఇంటర్‌తోనే చదువుకు స్వ స్తి పలుకుతున్నారు.ఈ నేపథ్యంలో అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్న అయిజలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విదార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. డిగ్రీ కళాశాల కోసం విద్యార్థుల ఆందోళనఅయిజలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వివి ధ పార్టీలు, విద్యా ర్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అందుకు అ నుగుణంగా పలుమా ర్లు ఆందోళనలు కూడా చేపట్టారు. అయినా పాలకులు స్పందించ డం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పా టుకు అవసరమై న స్థలం అందుబాటులో ఉన్నా స్థానిక ప్రజాప్ర తినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. గత నెల్లో కూడా ఇంటర్ విద్యార్థులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మద్దతుతో అయిజలో మానవహారం, రాస్తారో కో చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమయం వృథా అవుతోందిఅయిజలో డిగ్రీ కళాశాల లేకనే గద్వాలకు బస్సు పాసుతో బస్సులో ప్రయాణించి డిగ్రీ చదవాల్సి వస్తోంది. రావటం, పోవటంతోనే సమయం వృథా అవుతోంది. ప్రయాణంలో చేసి చదవటం కష్టంగా మారితోంది. ఇంటి పని సైతం చేసుకోలేని విధంగా అలసట, నీరసంగా ఉంటుంది. పైగా ఖర్చుతో కూడుకున్నది. అయిజలో కళాశాల ఏర్పాటు చేస్తే బాలికలకు బాగుంటుంది. – భాగ్యవతి, డిగ్రీ విద్యార్థిని, ఎంఏఎల్‌డీ కళాశాల, గద్వాల పై చదువులకు దూరం అవుతానేమోఅయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. ఉన్నత చదువులైన డిగ్రీ కోసం శాంతినగర్, గద్వాలకు రోజు వెళ్ళి చదువుకోవాలంటే కష్టం అంటున్నారు. పైగా పంపించటానికి మా తల్లిదండ్రులు సైతం ఆలోచిస్తున్నారు. ఇంటర్‌తోనే నా చదువు ఆగిపోయ్యే అవకాశం ఉంది. నాలాంటి వారు పై చదువులకు దూరం కాకుండా ఉండాలంటే అయిజలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. – తులసీ, ఇంటర్, అయిజ




# ముగిసిన మోదీ అమెరికా పర్యటన

వాషింగ్టన్: భారత్– అమెరికా సంబంధాల విషయంలో సరికొత్త, అద్భుతమైన ప్రయాణం మొదలైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తన మూడు రోజుల అమెరికా పర్యటన ముగింపు సందర్భంగా.. ప్రధాని మోదీ వాషింగ్టన్‌లోని రోనాల్డ్ రీగన్ సెంటర్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. 'భారత్, అమెరికాలు కలిసి విధానాలు, ఒప్పందాలు రూపొందించడమే కాదు.. జీవితాలు, కలలను, భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయ'ని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ప్రవాస భారతీయుల పాత్రను ప్రశంసించారు. 'భారత్, అమెరికాల మధ్య భాగస్వామ్యం 21వ శతాబ్దపు ప్రపంచాన్ని మెరుగుపరుస్తుంది. ఈ భాగస్వామ్యంలో మీరందరూ కీలక పాత్ర పోషిస్తారు. భారత అభివృద్ధికి అతిపెద్ద ప్రోత్సాహం దేశ ప్రజల ఆకాంక్షే. ఇది అమెరికాకు కూడా అపారమైన అవకాశాలను తెచ్చిపెడుతోంది. భారతీయ విమానయాన సంస్థలు అమెరికన్ కంపెనీలకు వందలాది విమానాలను ఆర్డర్ చేస్తున్నాయి. ఫలితంగా ఇక్కడ ఉద్యోగాలు వస్తున్నాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 100కుపైగా భారతీయ కళాఖండాలను తిరిగి ఇచ్చేందుకు అమెరికా ప్రభుత్వం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం ఈజిప్టు పర్యటన కోసం కైరోకు బయలుదేరారు.

# ప్రభుత్వ విద్యారంగంలో మరో విప్లవాత్మక అడుగు



తాడేపల్లి: ప్రభుత్వ విద్యారంగంలో మరో విప్లవాత్మక అడుగుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ సమక్షంలో నాంది పడింది. ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సీఎం ప్రత్యేక చర్య తీసుకున్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు టోఫెల్ పరీక్షల నిర్వహణ అంశంలో శిక్షణ, నిర్వహణలకు ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్)తో ముఖ్యమంత్రి వైయస్ జగన్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

ఈ మేరకు ఈటీఎస్ తరపున ఒప్పందంపై సంతకాలు చేసిన ఈటీఎస్ ఇండియాచీఫ్ రెవెన్యూ ఆఫీసర్ లెజో సామ్ ఓమెన్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఎంవోయూలు మార్చుకున్నారు.

# టీడీపీ, బీజేపీ పొత్తుపై సోమువీర్రాజు ఆసక్తికర వ్యాఖ్యలు



విజయవాడ: టీడీపీ, బీజేపీ పొత్తుకు సంబంధించి వస్తున్న వార్తలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... టీడీపీ చీఫ్ చంద్రబాబుతో కలిసి బీజేపీ పొత్తుతో వెళుతుందని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. కేంద్రమంత్రి అమిత్ షాతో చంద్రబాబు కలిసినంత మాత్రాన ఎవరిష్టం వచ్చినట్లు వారు ఊహించుకుంటే .. తామెలా చెబుతామని అడిగారు. సమావేశం అయ్యాక.. చంద్రబాబు ఎక్కడా ఆ అంశంపై మాట్లాడలేదని తెలిపారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలపై బీజేపీ పార్టీ ముఖ్య నేతలు విమర్శలు చేశారని... ఈ పరిణామాలను ఎలా అయినా ఎవరికి వారు అన్వయించుకోవచ్చన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై మీరు అడగటం సహజం.. నేను చెప్పడం ధర్మమని తెలిపారు. ఈ రాష్ట్రానికి డబుల్ ఇంజన్ సర్కార్ కావాలనేది తన ఆకాంక్ష అన్నారు. ప్రధాని మోడీ చేసిన అభివృద్ధి, సంక్షేమం అందరికీ కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని.. చూపాలని అడుగుతున్నామని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్, కాపు ఉద్యమ నేత ముద్రగడలు ఇద్దరూ రాజకీయాల్లో ఉన్నారని... ప్రజా జీవితంలో ఉన్నారని తెలిపారు. వారిద్దరి మధ్య వివాదం... కులపరంగా చూడకూడదని.. కేవలం రాజకీయంగా మాత్రమే చూడాలనేది తన అభిప్రాయంగా సోమువీర్రాజు పేర్కొన్నారు.


**ఏపీలో అభివృద్ధి అంతా కేంద్ర చేసిందే...** మోడీ తొమ్మిదేళ్ల పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 30 నుంచి ఈరోజు వరకు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకు వెళ్లామన్నారు. మోడీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంపై మాత్రం చాలా చోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. రాష్ట్రంలో గాలి మారుతుందని.. కమలం వికసిస్తుందని అన్నారు. కేంద్రంలో మూడోసారి మోడీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో కూడా బీజేపీ కమలం వికసిస్తుందనే విశ్వాసం తమకుందన్నారు. తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమ కష్టాలు చెప్పుకుని కన్నీళ్లు పెడుతున్నారని తెలిపారు. ఏ అంశంలో తాము అద్భుతంగా చేశామని చెప్పుకోవడానికి వారికి ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. రోడ్ల విషయంలో చర్చ పెడితే.. ఎన్ని రోడ్లు వేశారో రాష్ట్ర ప్రభుత్వం చెబుతుందా అని నిలదీశారు. ఏపీలో ఎటువంటి అభివృద్ధి జరిగినా.. అది కేవలం మోడీ చేసిన సాయమే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేదన్నారు. కేంద్రం ఇస్తున్న పథకాలకు డబ్ చేసి వారి పేర్లు పెట్టుకోవడమే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ కోసం తాము పని చేస్తామని సోమువీర్రాజు వెల్లడించారు.

# వైసీపీ నేతలను కాలకేయులతో పోల్చిన అచ్చెన్న...




అమరావతి: సీఎం జగన్, వైసీపీ నేతలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. వైసీపీ నేతలను కాలకేయులతో పోల్చారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ కాలకేయులను జగన్ రెడ్డి దళితులపైకి వదిలారన్నారు. కాలకేయుల సంఘం అధ్యక్షుడిలా వైసీపీ నేత కళ్లం హరికృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసీపీలో ఆకు రౌడీలు దగ్గర నుంచి బడా నేతల వరకు ప్రజలపై దాడులు చేస్తూ హింసలకు పాల్పడుతున్నారన్నారు. మాట్లాడుకుందాం రమ్మని పిలిచి కంతేరు దళితులపై దాడి చేస్తారా అంటూ మండిపడ్డారు. దళితులపై దాడి జరిగి 24 గంటలు అవుతున్నా దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ దళిత మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఈ దాడులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దళితులపై దాడులు జరుగుతుంటే వైసీపీ దళిత నాయకులు గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మారణాయుధాలతో అనంతపురంలో స్వైరవిహారం చేసిన నాడే హరికృష్ణారెడ్డిపై చర్యలు తీసుకుని ఉంటే దళితులపై దాడి జరిగేది కాదని ఆయన అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో హరికృష్ణారెడ్డి లాంటి విషపు నాగులను పాలు పోసి పోషిస్తున్నారని.. వీరి ఆగడాలకు దళితులు బలవ్వాలా అని నిలదీశారు. కాలకేయుల పాలన నుంచి ఎప్పుడు విముక్తి కలుగుతుందా అని దళితులు వేచిచూస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చడానికి సిద్ధంగా ఉన్నారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# అంబటి.. నోటి పారుదల మంత్రి: జనసేన నేత విమర్శలు



సత్తెనపల్లి: ఏపీ మంత్రి అంబటి రాంబాబుపై జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు విమర్శలు గుప్పించారు. పార్టీలో సీనియర్‌గా కనిపించడం కోసమే అంబటి తలకు రంగు వేయడం లేదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర నీటిపారుదల శాఖకు మంత్రిగా అంబటి రాంబాబు న్యాయం చేయలేదని వెంకటేశ్వరరావు విమర్శించారు. అంబటిని నీటి పారుదల శాఖ మంత్రి అనడం కంటే నోటి పారుదల శాఖ మంత్రి అనడం సబబు అని అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అంబటి రాంబాబు చేసిన ఆరోపణలపైనా ఆయన తీవ్రంగా స్పందించారు. వారాహి యాత్ర, పవన్ కల్యాణ్‌పై ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అంబటి అవినీతిపై కౌన్సిలర్లు ఆరోపణలు చేసినా సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి జనసేన పోటీలో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.




మాస్కో: గతేడాదిగా ఉక్రెయిన్‌పై దురాక్రమణ చేస్తోన్న రష్యాలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. యుద్ధ భూమిలో ఇప్పటివరకు ఆశించిన ఫలితం దక్కని పుతిన్ ప్రభుత్వానికి ఇప్పుడు ఓ పిడుగులాంటి వార్త ఆందోళన కలిగిస్తోంది. సైనికచర్యలో రష్యా బలగాలకు అండగా ఉన్న వాగ్నర్ గ్రూప్.. ఇప్పుడు తిరుగుబావుటా ఎగరేసింది. మాస్కోలోని సైనిక నాయకత్వాన్ని కూలదోసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ప్రతినబూనింది. ఈ క్రమంలో తమ దారికి అడ్డుగా వచ్చే వారిని ఉపేక్షించమని స్పష్టం చేసింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. ఉక్రెయిన్‌లో తమకు ఎదురవుతున్న సవాళ్లపై వాగ్నర్ సేన అధిపతి యెవ్‌గెనీ ప్రిగోజిన్ ఎప్పటికప్పుడు బహిరంగంగా తన అసంతృప్తిగా వ్యక్తం చేస్తున్నారు. ఆయన అక్కడి రక్షణ శాఖపై తీవ్ర అసహనంతో ఉన్నారు. ఈ క్రమంలో రష్యా సైనిక నాయకత్వాన్ని కూలదోస్తామని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దానికి సంబంధించి వెలుగులోకి వచ్చిన ఆడియో క్లిప్ ఇప్పుడు ప్రభుత్వాన్ని కలవరపాటుకు గురి చేస్తోంది. 'మా దళాలు రష్యా దక్షిణ ప్రాంతమైన రొస్తోవ్‌లోకి ప్రవేశించాయి.

అవి ముందుకు దూసుకెళ్తున్నాయి. మాకు ఎదురయ్యే అడ్డంకులను ధ్వంసం చేసుకుంటూ వెళ్తాం 'అని ప్రిగోజిన్ ఆందులో హెచ్చరించారు. అలాగే రష్యన్లు ఎవరూ తమకు అడ్డుగా రావొద్దని, తమ గ్రూప్‌లో చేరాలని సూచించారు. 'ఇది సైనిక తిరుగుబాటు కాదు. న్యాయం కోసం చేస్తోన్న మార్చ్'అని వ్యాఖ్యానించారు. అయితే ఆ క్లిప్‌లో ఉన్న వ్యాఖ్యలు ఎవరివనేదానిపై పూర్తిస్థాయి స్పష్టత లేదు.

**సైనిక నాయకత్వమే లక్ష్యం..! :** సైనిక నాయకత్వం లక్ష్యంగానే వాగ్నర్ సేనలు ముందుకు కదులుతున్నట్లు కనిపిస్తోంది. అధ్యక్షుడి అధికారాలు, ప్రభుత్వం, పోలీసులు, రష్యా గార్డ్స్ విధులకు ఎలాంటి ఆటంకం ఉండదని ప్రిగోజిన్ చెప్పిన మాటలు చూస్తుంటే.. ఆయన ఆగ్రహమంతా రక్షణ శాఖపై అని స్పష్టమవుతోంది. యుద్ధం పేరుతో రష్యా రక్షణ శాఖ తన దళంలోని అనేకమందిని హతమార్చిందని వాగ్నర్ అధిపతి ఆరోపించారు. అందుకు తగ్గట్టే రష్యా రక్షణ శాఖ మంత్రి సెర్గీ షోయిగు ఉన్న రొస్తోవ్ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు.




తిరుమల: అలిపిరి నడక మార్గంలో ఏడో మైలు వద్ద మూడేళ్ల బాలుడిపై గురువారం దాడి చేసిన చిరుత బోనులో చిక్కింది. దాడి అనంతరం అలిపిరి మార్గంలో 150 ప్రాంతాల్లో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుత సంచారాన్ని గమనించిన అటవీ శాఖ అధికారులు శుక్రవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో రెండు బోన్లను ఏర్పాటు చేశారు. నిన్న రాత్రి 10:45 గంటల ప్రాంతంలో చిరుత బోనులో చిక్కినట్లు అధికారులు తెలిపారు. బోనులో చిక్కిన చిరుతను తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో ధర్మారెడ్డి పరిశీలించారు. ఒక్క రోజు వ్యవధిలోనే చిరుతను బంధించడంపై భక్తులు తితిదే అధికారులను అభినందిస్తున్నారు. అలిపిరి నడక మార్గంలో బాలుడిపై చిరుత దాడి చేసిన ప్రదేశాన్ని తితిదే ఈవో ధర్మారెడ్డి మరోమారు పరిశీలించిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా.. భక్తులను ఎలాంటి ఇబ్బంది కలగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు.

**బృందాలుగా భక్తులు :** రాత్రి 7 గంటల తరువాత అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం నుంచి 200 మంది చొప్పున భక్తులను బృందాలుగా పంపే ఏర్పాటు చేశారు. వీరితోపాటు సెక్యూరిటీ గార్డ్ ఉంటారు. చిన్న పిల్లలను బృందం మధ్యలో ఉంచుకుని అప్రమత్తంగా వెళ్లాలి. అలిపిరి మార్గంలో రాత్రి 10 వరకు భక్తులను అనుమతిస్తారు. సాయంత్రం 6 గంటల తరువాత ఘాట్‌రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనదారుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయమై అధికారులు యోచిస్తున్నారు.

# అలిపిరిలో ఏం జరిగిందో అందరికీ తెలుసంటూ..
# పవన్, చంద్రబాబుపై వెల్లంపల్లి వివాదాస్పద వ్యాఖ్యలు..



తిరుమల : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి ఎటువంటి ప్రోటోకాల్ లేదని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. పవన్ ఒకవేళ శ్రీవాణి ట్రస్టు టిక్కెట్టు కొనుక్కోలేకపోతే.. సర్వ దర్శనం క్యూ లైన్లో దర్శనానికి రావాలన్నారు. శ్రీవాణి ట్రస్టు ప్రవేశపెట్టడం ద్వారా టీటీడీ దళారీ వ్యవస్థని రూపుమాపిందన్నారు. శ్రీవాణి ట్రస్టు నిధులు మళ్లిస్తున్నారంటూ పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తూ శ్రీవారితో చెలగాటం ఆడుతున్నారని వెల్లంపల్లి విమర్శించారు. గతంలో చంద్రబాబుపై అలిపిరిలో ఏమి జరిగిందో అందరికీ తెలుసని.. సీఎం పదవిని కూడా పొగట్టుకున్నాడని వెల్లంపల్లి ఎద్దేవా చేశారు. రాబోవు రోజుల్లో చంద్రబాబు తిరుమలకి వచ్చే పరిస్థితి ఉండదన్నారు. భక్తుల్లో అపోహలను సృష్టించేందుకే పవన్, చంద్రబాబు ఆరోపణలు చేశారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ శ్రీవారికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

టీటీడీలో నిధులు మళ్లింపు సాధ్యం కాదన్నారు. టీటీడీపై అసత్య ఆరోపణలు చేస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ని ప్రజలు తరిమి కొట్టాలన్నారు. ముందస్తు ఎన్నికలు ఉండవని.. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు.

# పవన్ సీఎం కావాలని కోరుకుంటున్నానంటూ తిరుమల వెంకన్న సాక్షిగా ఏపీ మంత్రి సంచలనం

తిరుమల : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నానంటూ మంత్రి విశ్వరూప్ తిరుమల వెంకన్న సాక్షిగా సంచలనానికి తెరదీశారు. నేడు తిరుమలలో విశ్వరూప్ మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ సీఎం కావాలని ఆయన అభిమానులు మాత్రమే కాకుండా తానూ కోరుకుంటున్నానన్నారు. రాష్ట్రంలో ఎవరైనా యాత్రలు చేసుకోవచ్చన్నారు.

సీఎం కావాలంటే 175 స్థానాల్లో పోటీ చేసి 88స్థానాల్లో గెలిస్తే సీఎం అవ్వొచ్చని తెలిపారు. పొత్తుతో 100 స్థానా ల్లోనైనా పోటీ చేసి 50 స్థానాల్లోనైనా గెలవాలన్నారు. ప్రజాస్వామ్యంలో రెండు విధాలుగా సీఎం అవుతారని మంత్రి విశ్వరూప్ అన్నారు.



# లోకేష్ యువగళం పాదయాత్ర కాదు.. అదో విహారయాత్ర



నెల్లూరు: టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రపై ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ విమర్శలు గుప్పించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర కాదని.. అదో విహారయాత్ర అని వ్యాఖ్యలు చేశారు. జగన్ పాదయాత్ర చేస్తే ఉదయం నుంచి రాత్రి వరకు చేశారన్నారు. సాయంత్రం 4 గంటలకు కాసేపు నడిచి లోకేష్ కాలయాపన చేస్తున్నారని అన్నారు. లోకేష్ మాట్లాడే ముందు భాష నేర్చుకోవాలని హితవుపలికారు. "లోకేష్‌కు నిజంగా దమ్ముంటే జిల్లాలో అభివృద్ధిపై చర్చకి రావాలి. సమయం, వేదిక నీ ఇష్టం.. ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎవరి హయాంలో జరిగాయో తెలుసా? జిల్లాలో పెన్నానదిపై సంగం, నెల్లూరు బ్యారేజీలు ఎవరు పూర్తి చేశారో తెలుసా?. నెల్లూరు సిటీలో చర్చిద్దాం.. దమ్ముంటే రా... లోకేష్"కు అనిల్ ఛాలెంజ్ విసిరారు. రాష్ట్రమంతా పాదయాత్ర తరువాత ముందు మంగళగిరిలో గెలువు చూద్దామన్నారు. ఆనం కుటుంబం పట్ల ఇంకా మంచిపేరు ఉందంటే అది విజయ్ కుమార్ రెడ్డి వల్లే అని అన్నారు. ఎమ్మెల్యే అవకాశం ఇస్తే జగన్‌ను విమర్శిస్తావా? అంటూ మండిపడ్డారు. జిల్లాలో అభివృద్ధిపై ఆనం వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. సిగ్గుంటే ఎమ్మెల్యే పదవికి ఆనం రాజీనామా చేసి వెళ్ళాలి అని ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ వ్యాఖ్యలు చేశారు.

# సమంత సెకండ్ లీడ్ కే పరిమితమా?

సౌత్ లో స్టార్ హీరోయిన్ గా సుదీర్ఘకాలం నుంచి తన హవా కొనసాగిస్తున్న అందాల భామ సమంత. ఈ అమ్మడు గత ఏడాది యశోద మూవీతో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. ఈ ఏడాది శాకుంతలం సినిమాతో బిగ్గెస్ట్ డిజాస్టర్ ని ఖాతాలో వేసుకుంది. ఈ మూవీ గుణశేఖర్ ని నిండా ముంచేసింది. ఇదిలా ఉంటే శాకుంతలం ఫెయిల్యూర్ నుంచి ఇప్పటికే సమంత బయటకి వచ్చేసింది. ఆమె ప్రస్తుతం బాలీవుడ్ డ్రీమ్ లో ఉంది. ఆ దిశగానే అడుగులు వేసుకుంటూ వెళ్తోంది. తెలుగులో కమిట్ అయిన ఖుషి మూవీ కంప్లీట్ అయితే ఇంకా పూర్తిస్థాయిలో బాలీవుడ్ మీదనే సమంత



ఫోకస్ పెట్టనుంది. ది ఫ్యామిలీ మెన్ 2 వెబ్ సిరీస్ తో వచ్చిన ఫేమ్ ని కొనసాగించాలని సమంత భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రియాంకా చోప్రా సిటాడెల్ ఇండియన్ వెర్షన్ లో సమంత నటిస్తోంది. మరో వైపు ఆయుష్మాన్ ఖురానా లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న సినిమాలో సమంత ఘోస్ట్ గా ఇంటరెస్టింగ్ క్యారెక్టర్ లో కనిపిస్తుందంట. సినిమాలో ఆమె పాత్రకి ప్రాధాన్యత ఉన్న హీరోయిన్ మాత్రం కాదని టాక్. ఇక తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మతో కలిసి ఒక వెంచర్ స్టార్ట్ చేయబోతోంది.

అనుష్క శర్మ ఒక వెబ్ సిరీస్ ప్రపోజల్ సమంతకి పెట్టిందంట. ఈ వెబ్ సిరీస్ నచ్చడంతో సమంత ఒకే చెప్పినట్లు టాక్. ఇందులో ఇద్దరు హీరోయిన్స్ కి సమానమైన స్కోప్ ఉంటుందంట. ఒక పాత్రలో అనుష్క శర్మ కనిపించానుండగా మరో క్యారెక్టర్ లో సమంత నటించనుంది. ఇక ఈ ప్రాజెక్ట్ ని సమంత అనుష్క కలిసి నిర్మించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ వెబ్ సిరీస్ తో అనుష్క శర్మ తమ్ముడు కర్నేష్ శర్మ దర్శకుడిగా పరిచయం అవ్వనున్నాడంట. 25 కోట్ల వరకు ఈ వెబ్ సిరీస్ కి ఖర్చు అవ్వనున్నట్లు తెలుస్తోంది. దీనిని బట్టి యాక్షన్ బ్యాక్ డ్రాప్ లోనే దీనిని కూడా తెరకెక్కించే ఛాన్స్ ఉందని టాక్. ఇక శాకుంతలం డిజాస్టర్ తర్వాత సమంత బాలీవుడ్ ఆశలు తీర్చడానికి సిటాడెల్ మాత్రమే ఉంది. వరుణ్ ధావన్ ఈ వెబ్ సిరీస్ లో సమంతకి జోడీగా కనిపిస్తున్నాడు. అయితే ఎన్ని ప్రాజెక్ట్స్ చేసిన కూడా సమంత బాలీవుడ్ లో సెకండ్ హీరోయిన్ క్యారెక్టర్స్ కి మాత్రమే పరిమితం అవుతుందనే టాక్ ఇప్పుడు వినిపిస్తోంది.

# తడిసిన అందాలతో ప్రగ్యా.. మైండ్ బ్లోయింగ్

ప్రగ్యా జైశ్వాల్... 2014లో టిట్టూ ఎంబీఏ చిత్రం ద్వారా హిందీ చిత్ర సీమలో అడుగు పెట్టింది. అదే ఏడాది డేగ సినిమాతో తెలుగు సినీ రంగంలోనూ కనిపించి మెప్పించింది. ఆ తర్వాత మిర్చిలాంటి కుర్రాడు కంచె ఓం నమో వెంకటేశాయ గుంటూరోడు నక్షత్రం జయ జానకీ నాయకా ఆచారి అమెరికా యాత్ర సైరా అఖండ సినిమాల్లోనూ నటించి తనకంటూ సెపరేట్ ఫ్యాన్స్ బేస్ ను పెంచుకుంది. ముఖ్యంగా కంచె సినిమాలో సీతగా.. వరుణ్ తేజ్ సరసన నటించి అందిరనీ ఆక్టటుకుంది. తెలుగు సినీ ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాధించుకుంది. అలాగే నటసింహం నందమూరి బాలకృష్ణ సరసన అఖండ సినిమాలో నటించి మరింత క్రేజ్ దక్కించుకుంది. ఈ క్రేజ్ తోనే ఈ అమ్మడును సోషల్ మీడియాలో ఫాలో అయ్యే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. కేవలం సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా ఈ అమ్మడు చాలా



యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన పర్సనల్ లైఫ్ విషయాలతో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా ఈ క్యూట్ బ్యూటీ తనకు సంబంధించిన ఓ ఫొటోను ఇన్ స్టా వేధికగా షేర్ చేసుకుంది. అందులో ప్రగ్యా చాలా అందంగా కనిపిస్తోంది. బ్లాక్ కలర్ బికినీ వేసుకొని తడి అందాలతో నెట్టింట రచ్చ చేస్తోంది. థైస్ అందాలతో పాటు ఎద అందాలను ఆరబోస్తూ.. కుర్రకారు గుండెల్లో హీటు పుట్టిస్తోంది. హాట్ హాట్ లుక్స్ తోనే యువతను ఆగం చేస్తోంది. ప్రగ్యా వేసుకున్న ఈ బికినీలో బాడీ షేపులన్నీ చాలా బాగా కనిపిస్తున్నాయి. ఆమె ఫొటోలు షేర్ చేసిన కొన్ని గంటల్లోనే విపరీతమైన లైకులు కామెంట్లు వస్తున్నాయి. సో సెక్సీ హాటీ అంటూ నెటిజెన్లు కామెంట్లు చేస్తున్నారు. రోజురోజుకూ గ్లామర్ డోస్ పెంచుతున్నావేంటమ్మ అని అడుగుతున్నారు. ఇంతకు ముందు సంప్రదాయ బద్ధంగా కనిపించిన నువ్వు ఇంత హాట్ గా తయారవడానికి కారణం ఏంటో అంటూ మరికొంత మంది తమ మనసులోని భావాలను వెల్లడిస్తున్నారు. సింగిల్ పీస్ బికినీలో స్విమ్ చేసి వచ్చిన నిన్ను నీ అందాలను చూస్తే తట్టుకోవడం చాలా కష్టంగా ఉందని అంటున్నారు.




# బ్రో అవుట్ పుట్ ఎలా ఉంది..?



పవన్ కళ్యాణ్ సాయి తేజ్ కలిసి చేస్తున్న మల్టీస్టారర్ మూవీ బ్రో. తమిళ సినిమా వినోదయ సీతం రీమేక్ గా మాతృక దర్శకుడు సముద్రఖని ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారు. రీసెంట్ గా వచ్చిన ఈ సినిమా మోషన్ పోస్టర్స్ సినిమాపై సూపర్ బజ్ ఏర్పడేలా చేశాయి. పవన్ సాయి తేజ్ మెగా మామ అల్లుడు కలిసి చేస్తున్న ఈ మెగా మల్టీస్టారర్ మీద మెగా ఫ్యాన్స్ భారీ అంచనాలు ఏర్పరచుకున్నారు. సినిమా అవుట్ పుట్ కూడా అదే రేంజ్ లో వస్తుందని టాక్. ఈ సినిమాలో పవన్ మరోసారి దేవుడిగా కనిపించనున్నారు. ఆల్రెడీ గోపాల గోపాల సినిమాలో కృష్ణుడిగా నటించారు పవన్ కళ్యాణ్. ఇక ఇప్పుడు బ్రో సినిమాలో కూడా మరోసారి దేవుడిగా నటించారు. సినిమాలో పవన్ లుక్స్ ఆయన డైలాగ్స్ అన్ని చాలా ప్రత్యేకంగా ఉంటాయని తెలుస్తుంది. పవర్ స్టార్ ఫ్యాన్స్ కి ఈ సినిమా పండుగ చేసుకునేలా ఉంటుందని.. పవన్ దేవుడిలా కనిపించినా ఆయన పాత్రలో కావాల్సిన కమర్షియల్ హంగులు అద్దుతున్నారట మేకర్స్. అయితే సినిమాలో మేనల్లుడు సాయి తేజ్ ఉన్న కారణంగా ఎక్కడ తన పాత్రని మరీ తగ్గించకుండా జాగ్రత్త పడుతున్నారట. పవన్ సలహా మేరకే సాయి తేజ్ పాత్రకి ఎక్కువ స్కోప్ ఉండేలా చేస్తున్నారట. అయితే పవన్ ని డామినేట్ చేసేలా కాదు కాని సినిమాలో ఎక్కువ భాగం సాయి తేజ్ కనిపించేలా ఉంటుందని అర్థమవుతుంది. విరూపాక్షతో సూపర్ హిట్ అందుకున్న సాయి తేజ్ బ్రో సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నాడు. సినిమాలో సాయి తేజ్ నటన కూడా ఆడియన్స్ ని ఇంప్రెస్ చేస్తుందని అంటున్నారు. బ్రో సినిమాకు సంబంధించి పవన్ షూట్ ఎప్పుడో పూర్తి కాగా సాయి తేజ్ కి సంబంధించిన సీన్స్ కూడా దాదాపు పూర్తి చేశారట. కొద్దిపాటి ప్యాచ్ వర్క్ మినహా సినిమా దాదాపు పూర్తయినట్టు తెలుస్తుంది. ఇక ఇప్పటివరకు జరిగిన షూటింగ్ రష్ చూసి చిత్ర యూనిట్ సూపర్ హ్యాపీగా ఉన్నారట. సినిమా అనుకున్నది అనుకున్నట్టుగా అవుట్ పుట్ వస్తుందని సాటిస్ఫైడ్ గా ఉన్నారట. ఇక పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలో ఉన్నాడు అంటే ఆ సినిమా బిజినెస్ ఏ రేంజ్ లో జరుగుతుందో తెలిసిందే. బ్రో సినిమాకు కూడా టీజర్ కూడా రిలీజ్ కాకుండానే బిజినెస్ ఆఫర్లు భారీగా వస్తున్నాయని తెలుస్తుంది. మెగా మల్టీస్టారర్ గా వస్తున్న ఈ బ్రో సినిమాపై మెగా ఫ్యాన్స్ కూడా చాలా అంచనాలు పెట్టుకున్నారు. తప్పకుండా సినిమా ఓపెనింగ్స్ కూడా భారీ రేంజ్ లో ఉంటాయని చెప్పొచ్చు. బ్రో సినిమాకు సముద్రఖని డైరెక్షన్ చేస్తున్నా వెనుక కథ అంతా త్రివిక్రం నడిపిస్తున్నారని తెలిసిందే. పవన్ చేసే రీమేక్ లకు త్రివిక్రం కథనం మాటలు అందిస్తుంటారు. బ్రో విషయంలో కూడా అదే జరుగుతుంది. ఈ సినిమాను జూలై 28న రిలీజ్ ఫిక్స్ చేశారు మేకర్స్.

# అందాలతో 'ధమ్కీ' ఇస్తున్న ముద్దుగుమ్మ





తమిళ ముద్దుగుమ్మ నివేత పేతురాజ్ తెలుగు ప్రేక్షకులకు మెంటల్ మదిలో అనే సినిమాతో పరిచయం అయిన విషయం తెల్సిందే. మొదటి సినిమా తోనే నటి గా నివేదా కి మంచి మార్కులు పడ్డాయి. ఆ సినిమా కూడా పర్వాలేదు అనిపించుకోవడంతో వరుసగా ఆఫర్లు వచ్చాయి. మెగా హీరో సాయి ధరమ్ తేజ్ తో చేసిన చిత్రలహరి నటిగా నివేత కి మంచి పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత నుంచి వరుసగా సినిమాలు మరియు సిరీస్ ల్లో నటిస్తూనే వస్తుంది. ఇటీవల దాస్ కీ ధమ్కీ సినిమా తో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పార్టీ అనే తమిళ సినిమాలో నటిస్తోంది. మరి కొన్ని ప్రాజెక్ట్ లు చర్చల దశలో ఉన్నాయి. హీరోయిన్ గా నివేదా ఎంత బిజీ గా ఉన్నా కూడా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా తన అందాల ఆరబోత ఫోటోలు మరియు వీడియో లను షేర్ చేస్తూ ఉంటుంది. తాజా గా మరోసారి ఈ అమ్మడి యొక్క ఫోటోలు నెట్టింట వైరల్ అవుతూ అందరి దృష్టి ని ఆకర్షిస్తూ తెగ లైక్స్ మరియు షేర్స్ ని దక్కించుకుంటుంది. నడుము అందాన్ని చూపిస్తూ రెడ్ కలర్ క్రాప్ టాప్ లో నివేత క్యూట్ గా అందంగా కనిపిస్తోంది అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే ఈ అమ్మడి ఫిజిక్ కు మరియు అందానికి స్టార్ హీరోల కు జోడీ గా నటించే అవకాశాలు దక్కించుకోవాలి. కానీ పాపం అదృష్టం కలిసి రావడం లేదని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రాశి ఖన్నా నిజంగా గ్రేట్!

అక్కినేని వారి 'మనం' సినిమాలో చిన్న పాత్రలో కనిపించి అదే సంవత్సరం 'ఊహలు గుసగుసలాడే' సినిమా తో హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు దక్కించుకున్న ఈ అమ్మడు ఆ వెంటనే జోరు.. జిల్.. శివమ్.. బెంగాల్ టైగర్ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది. ఈ ముద్దుగుమ్మ నటించిన సినిమాలు కమర్షియల్ గా నిరాశ పర్చినా కూడా ఆమెకు మంచి గుర్తింపు తీసుకు వచ్చాయి. అంతే కాకుండా హీరోయిన్ గా ఆమె మరింత స్టార్ గా కూడా నిలిచింది. ఎన్టీఆర్ కి జోడీగా జై లవకుశ సినిమాలో రాశి ఖన్నా నటించింది. కొత్త హీరోలతో పాటు స్టార్ హీరోలకి కూడా జోడీగా నటించి మెప్పించిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. తెలుగులో మాత్రమే కాకుండా తమిళంలో కూడా వరుసగా సినిమాల్లో నటిస్తూ వస్తుంది.



అప్పుడప్పుడు మలయాళం మరియు హిందీ సినిమాల్లో కూడా నటిస్తోంది. రాశి ఖన్నా సినీ కెరీర్ ప్రారంభం అయ్యి సరిగ్గా పది సంవత్సరాలు అయ్యింది. ఈ పదేళ్లలో ఆమె ఎన్నో సినిమాల్లో నటించడంతో పాటు స్టార్ డమ్ ను దక్కించుకుంది. ఈ పదేళ్ల కాలంలో రాశి ఖన్నా ప్రేమ వ్యవహారాల గురించి.. పెళ్లి గురించి పుకార్లు రాలేదు. ఈమె పూర్తిగా వర్క్ పై దృష్టి పెట్టి తన పని తాను చేసుకుంటూ వెళ్లడం వల్లే ఇప్పటి వరకు ఎలాంటి ప్రేమ పుకార్లు.. ఇతర రిలేషన్ పుకార్లు రాలేదు. ఇప్పటి వరకు రాశి ఖన్నా బాయ్ ఫ్రెండ్ అతడు.. ఇతడు అనే పుకార్లు కూడా రాలేదు అంటే వర్క్ పట్ల ఆమె డెడికేషన్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కెరీర్ ఆరంభంలో బరువు ఎక్కువగా ఉన్నావంటూ కొందరు ట్రోల్స్ చేయడంతో పాటు తెలుగు సినిమాలకు సన్నని ఫిజిక్ కావాలనే ఉద్దేశ్యంతో కష్టపడి నేచురల్ పద్దతిలో బరువు తగ్గింది. ఇప్పటికీ అదే సన్నని ఫిజిక్ ను మెయింటెన్ చేస్తూ తన స్టార్ స్టేటస్ ను కాపాడుకుంటూ సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ఇదే తరహాలో రాశి ఖన్నా కష్టపడి వర్క్ పట్ల డెడికేషన్ చూపించినట్లయితే కచ్చితంగా మరో పదేళ్ల పాటు ఇండస్ట్రీలో హీరోయిన్ గా కొనసాగే అవకాశాలు ఉంటుంది. రాశి ఖన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు.

# జీవితం మొత్తం ఈ జ్ఞాపకాలు నాతోనే ఉంటాయి

బాలీవుడ్ సీనియర్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ కూతురు సారా అలీ ఖాన్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి తన ప్రతిభను చూపిస్తూ సక్సెస్ లతో దూసుకు పోతుంది. ఆమె నటించిన సినిమాలు కమర్షియల్ నిరాశ పర్చుతూ ఉన్నా కూడా తన నటనతో మెప్పిస్తూనే ఉంది. తాజాగా మరో ఇంట్రెస్టింగ్ పాత్రతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. కన్నన్ దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మాణంలో రూపొందుతున్న 'ఏ వతన్ మేరే వతన్' చిత్రంలో సారా అలీ కీలక పాత్రలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తి అయ్యింది అంటూ స్వయంగా సారా అలీ ఖాన్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ఆ సందర్భంగా కొన్ని ఫోటోలను కూడా షేర్ చేసింది. 1942 క్విట్ ఇండియా ఉద్యమం నేపథ్యంలో ఈ సినిమా



రూపొందిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో సారా అలీ ఖాన్ లుక్ ఇప్పటి వరకు చూడని విధంగా డిఫరెంట్ గా ఉండబోతుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలను చూస్తే అర్థం అవుతుంది. షూటింగ్ పూర్తి అయ్యింది అంటూ సారా ప్రకటించడంతో పాటు ఆసక్తికర వ్యాఖ్యలను ఇన్ స్టా లో షేర్ చేసింది. ఇన్ స్టా లో సారా.. "రేపు నువ్వు చనిపోతానన్నట్లుగా జీవించు... ఎప్పటికీ జీవించినట్లు జీవించడం నేర్చుకో" అనే మహాత్మా గాంధీ కోట్ ను పంచుకుంది. అంతే కాకుండా ఈ శక్తివంతమైన పాత్రను పోషించడానికి నన్ను ఎంపిక చేసుకున్నందుకు గాను ధన్యవాదాలు కణ్ణన్ సర్ అంది. బలం గౌరవం మరియు అభిరుచి అనేవి నిజమైన వ్యక్తిత్వం. జీవితంలో కొన్ని సంఘటనలు మనకి ఎప్పటికీ గుర్తుండిపోయే జ్ఞాపకాలుగా ఉంటాయి. ఈ సినిమా కూడా అలాగే.. జీవితం మొత్తం ఈ సినిమా జ్ఞాపకాలు నాతోనే ఉంటాయి' అని పేర్కొంది.




హైదరాబాద్: సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఈ నెల 30 నుంచి పోడు భూముల పట్టాల పంపిణీ చేస్తామని ప్రకటించారు. అసిఫాబాద్ జిల్లాలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలంటూ మంత్రులు, ఎమ్మెల్యేలకు కేసీఆర్ ఆదేశాలిచ్చారు. ఎట్టకేలకు ఎన్నో సంవత్సరాలుగా పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. సంవత్సరాలుగా పోడు భూముల కోసం ఎదురుచూస్తున్న రైతుల కల నెరవేరనుంది. ఈ మేరకు ఎంపికైన లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అయితే గిరిజనులకే మొదటి ప్రాధాన్యత కింద పోడు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వచ్చిన దరఖాస్తుల్లోంచి గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇంతకాలం తమ భూములకు పట్టాలు ఇస్తామని భావించి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనేతరులు అయోమయంలో పడ్డారు. తాతల, తండ్రుల నుంచి భూమిని సాగు చేసుకుంటున్న తమకు హక్కు పత్రాలు వచ్చే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని గిరిజనేతరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమినే నమ్ముకుని గిరిజనులతో మమేకమై జీవిస్తున్న తమకు అన్యాయం చేయవద్దని తాము సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజనేతరులు కోరుతున్నారు. ఆయా జిల్లాలోని పరిధిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూనే అభయారణ్య భూములు, రెవెన్యూ భూములను మినహాయిస్తూ ఇతర భూములను రైతులకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.




అమెరికా ప్రసిద్ధ టెక్ కంపెనీలైన అమెజాన్ గూగుల్, మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇప్పటికే ఆయా సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెట్టగా.. ఆ పెట్టుబడులను మరింత విస్తరించడంతో పాటు సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయి. ప్రధాని మోదీ అమెరికా పర్యటన నేపథ్యంలో ఆయా సంస్థలు భారత్‌లో పెట్టుబడులకు హామీ ఇచ్చాయి. రాబోయే ఏడేళ్లలో 15 బిలియన్ డాలర్ల మేర భారత్‌లో పెట్టుబడులు పెడుతామని అమెజాన్ సంస్థ హామీ ఇచ్చింది. దీంతో భారత్‌లో కంపెనీ మొత్తం పెట్టుబడుల విలువ 26 బిలియన్ డాలర్లకు చేరుతుందని పేర్కొంది. ఈ మేరకు అమెజాన్ సీఈఓ యాండీ జాస్సీ ఓ ప్రకటన విడుదల చేశారు. కోటి చిన్న వ్యాపారాలను డిజిటైజ్ చేసేందుకూ అమెజాన్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. 2025 నాటికి భారత్ నుంచి 20 బిలియన్ విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తామని 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు అమెజాన్ ఇండియా ప్రత్యక్షంగా పరోక్షంగా 13 లక్షల ఉద్యోగాలను సృష్టించిందని వివరించారు. మరోవైపు గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఆపరేషన్స్‌ను ప్రారంభించబోతున్నట్లు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వెల్లడించారు. ఇండియా డిజిటలైజేషన్ ఫండ్‌లో గూగుల్ 10 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతున్న విషయాన్ని ప్రధానితో పంచుకున్నట్లు పిచాయ్ వివరించారు. అమెరికా పర్యటనలో ప్రధాని మోదీతో భేటీ అయిన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల.. భారత పౌరుల జీవనాన్ని టెక్నాలజీ ముఖ్యంగా ఏఐ ఎలా మార్చబోతోందన్నదీ పంచుకున్నారు. భారత్‌లో టెక్నాలజీ అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ కట్టుబడి ఉందని భేటీ అనంతరం నాదెళ్ల పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో సహాయం కోసం 'జుగల్బంది' పేరిట మొబైల్లో పనిచేసే ఏఐ ఆధారిత చాట్‌బాట్‌ను మైక్రోసాఫ్ట్ భారత్‌లో తీసుకొచ్చింది. ఏ భాషలో ప్రశ్న అడిగినా అర్థం చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఇది అందిస్తుంది. మరోవైపు గుజరాత్‌లో 2.75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.22,540 కోట్ల) మొత్తం పెట్టుబడితో సెమీకండక్టర్ అసెంబ్లింగ్, టెస్టింగ్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు మైక్రాన్ ప్రకటించింది. ఈ ఏడాదే ప్లాంటు పనులు ఆరంభమై, వచ్చే ఏడాదికి ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల 5000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 15000 మందికి కమ్యూనిటీ ఉద్యోగాలు వస్తాయి.

## బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే : షబ్బీర్ అలీ

కామారెడ్డి: బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ పార్టీ రెండూ ఒక్కటే అని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర మంత్రులతో మంత్రి కేటీఆర్ రహస్య సమావేశాలు నిర్వహించడంలో మంథనాలు ఎంటి అని ప్రశ్నించారు. రాష్ట్రానికి వచ్చిన కేంద్రమంత్రులను కలువకుండా... ఢిల్లీలో ఉన్న వారిని ఎందుకు కలుస్తున్నారని అడిగారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. నాణ్యత లోపం వల్లే టెక్రియాల్‌లో డబుల్ బేడ్ రూం ఇండ్లని ప్రజలు వద్దంటున్నారన్నారు. నాసిరకంతో ఇండ్లని నిర్మించి కాంట్రాక్టర్లు కమిషన్లకు ఆశ పడ్డారని మండిపడ్డారు. ఇండ్లు కట్టేది మేస్త్రీలే కదా... వాళ్ల పట్ల అవహేళనంగా మాట్లాడడం సరైంది కాదని.. వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డబుల్ బేడ్ రూం ఇండ్లు కూలిపోతే బీఆర్ఎస్ పార్టీ నాయకులే కారణమని షబ్బీర్ అలీ వ్యాఖ్యలు చేశారు.



## షర్మిలపై కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలపై కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్న విషయం తనకు తెలియదని చెప్పుకొచ్చారు. అయినా తెలంగాణలో కంటే ఏపీలో ఉంటేనే షర్మిలకు ఉపయోగమని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు బయటకు వెళ్లడం లేదని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కి వేవ్ స్టార్ట్ అయింది.. ఎవరి నోట చూసినా కాంగ్రెస్ పేరే వినిపిస్తోందని వివరించారు. ముస్లింలు కాంగ్రెస్ వైపే ఉన్నారని.. ఎందుకంటే కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని పేర్కొన్నారు. ఎన్నికల కోసమే బీసీ బంధు తీసుకొచ్చారని.. లక్ష రూపాయలు ఇచ్చి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. హెచ్‌సీఏ భూముల లీజు తీసేసి.. రాజీవ్ పేరు తొలగించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు.

## పార్టీ మార్పు వార్తలపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్ : పార్టీ మార్పుపై వస్తున్న వార్తలపై బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ప్రస్తుతం తాను బీజేపీలోనే ఉన్నానని.. ఊహాగానాలను నమ్మవద్దని తెలిపారు. తన అభిప్రాయాన్ని పార్టీ హైకమాండ్‌కు వివరిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందే అని స్పష్టం చేసిన రాజగోపాల్ రెడ్డి.. తెలంగాణ ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకారం ఇస్తుందని.. అందులో భాగంగానే కేటీఆర్‌కు కేంద్రమంత్రుల అపాయింట్మెంట్ అన్నారు. మంత్రి కేటీఆర్‌కు కేంద్ర మంత్రులు అపాయింట్మెంట్ ఇవ్వడాన్ని భూతద్దంలో పెట్టి చూడాల్సిన అవసరం లేదని రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాను కాంగ్రెస్ లో చేరుతున్నట్లు మీడియా ఎక్కువ చేసి చూపిస్తోందన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా తలుచుకుంటే ఇప్పటికీ తెలంగాణలో బీజేపీని అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత కొంచెం ప్రజల ఆలోచనలో కొంచెం మార్పు వచ్చినట్టు కనబడుతోందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.

## తెలంగాణ అంతటా విస్తరించిన 'నైరుతి'.. పలు జిల్లాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రమంతటా విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలోని కుమురం భీం, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాగల 3 రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇవాళ ఆవర్తనం వాయవ్య బంగాళాఖాతం దాని పరిసరాలలోని ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు దగ్గర్లో సగటు సముద్రమట్టానికి 7.6 కిలో మీటర్ల వరకు స్థిరంగా కొనసాగుతూ ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశ వైపునకు వంపు తిరిగి స్థిరంగా కొనసాగుతుందని వివరించారు.







హైదరాబాద్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య, జానకీపురం సర్పంచి నవ్య మధ్య తలెత్తిన వివాదం కొత్త మలుపు తిరిగింది. ఒప్పందం పేరుతో తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే రాజయ్యతో పాటు మరో నలుగురిపైన ధర్మసాగర్ పోలీసుస్టేషన్‌లో జానకీపురం సర్పంచి కురుసపల్లి నవ్య ఈ నెల 21న ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తాజాగా జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లు స్పందించాయి. ఎమ్మెల్యే, సర్పంచి మధ్య వివాదాన్ని కమిషన్లు సుమోటోగా స్వీకరించాయి. వివాదంపై విచారణ చేపట్టి నివేదిక అందించాల్సిందిగా పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేశాయి. కాగా, రాజయ్యపై చేసిన ఆరోపణలకు సంబంధించిన సాక్ష్యాలను సమర్పించాలని కాజీపేట ఏసీపీ.. సర్పంచి నవ్యను కోరారు.

**అసలేం జరిగిందంటే..** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య తనను లైంగికంగా వేధిస్తున్నారని గతంలో నవ్య ఆరోపణలు చేశారు. అయితే.. నవ్య, రాజయ్య సామరస్యంగా సమస్యను పరిష్కరించుకున్నారు. అదే విషయంలో గ్రామ అభివృద్ధి కోసం రూ.25లక్షలు తన నిధుల నుంచి ఇస్తానని ఎమ్మెల్యే రాజయ్య హామీ ఇచ్చారు. ఈ క్రమంలో నిధులు ఇవ్వకపోగా.. తాను డబ్బులు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోందని నవ్య.. ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇదే విషయంపై నవ్య భర్త ప్రవీణ్.. ఎమ్మెల్యేను నిలదీశారు. దీంతో రాజయ్య గ్రామాభివృద్ధికి రూ.25లక్షలు ఇస్తామని, రూ.20లక్షలు వ్యక్తిగతంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్‌కు రాజయ్య రూ.7లక్షలు ఇచ్చారు. మిగతా నగదు ఇవ్వాలని అడిగితే ఒప్పంద పత్రంపై సంతకం చేయాలని ఒత్తిడి తెచ్చారు. గతంలో చేసిన లైంగిక ఆరోపణలు రాజకీయ కోణంలో చేసినవని చెప్పాలని తెలిపారు. దీంతో పాటు రూ.20లక్షలు మళ్లీ అడిగినప్పుడు తిరిగివ్వాలని కోరారు. దీంతో సర్పంచి భర్త ప్రవీణ్ అంగీకరించకుండా వచ్చారు. ఆ తర్వాత పలుమార్లు ప్రవీణ్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి వేధించారు. దీంతో ప్రవీణ్ ఒప్పంద పత్రాన్ని తీసుకువచ్చి దానిపై సంతకం పెట్టమని నవ్యను ఒత్తిడికి గురిచేశాడు. సంతకం పెడితే తాను తప్పు చేస్తున్నట్లు అవుతుందని నవ్య తిరస్కరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రాజయ్యపై, పీఏ శ్రీనివాస్, ఎంపీపీ నిమ్మ కవిత, తన భర్త ప్రవీణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు నవ్య తెలిపారు. తనకు న్యాయం జరగకపోతే పోలీసు కమిషనర్, మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తానని వెల్లడించారు. తాజాగా ఈ వివాదంపై జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లు స్పందించాయి.




దిల్లీ: తెలంగాణపై భాజపా అధిష్ఠానం దృష్టి సారించింది. పార్టీలో నెలకొన్న తాజా పరిణామాలపై భాజపా అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని దిల్లీ రావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కూడా దిల్లీకి రావాలని పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. దీంతో హైదరాబాద్‌లో ఇవాల్టి కార్యక్రమాలను రద్దు చేసుకున్న కిషన్‌రెడ్డి.. దిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈటల, రాజగోపాల్‌రెడ్డితో నిర్వహించనున్న భేటీలో కిషన్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ భాజపా కాస్త డీలా పడినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీలో నెలకొన్న స్తబ్దతను తొలగించి.. అసంతృప్త నేతలను బుజ్జగించే పనిపై భాజపా అధిష్ఠానం దృష్టి పెట్టింది. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్టీలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. పార్టీ చేరికల కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్‌తో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇతర పార్టీలకు వెళ్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వీరిని దిల్లీకి రావాలని ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకొంది. కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఈటల, రాజగోపాల్‌రెడ్డితో పాటు పలువురు సీనియర్లను పిలుపించుకొని మాట్లాడాలని నిర్ణయించింది. మొత్తం మీద తెలంగాణ భాజపా నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుకు చెక్ పెట్టాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.




## పరిశీలిస్తున్న విద్యాశాఖ

హైదరాబాద్: పాఠశాలల సమయాల్లో కొన్ని మార్పులు చేసే ఆలోచనలో పాఠశాల విద్యాశాఖ ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఉన్నత పాఠశాలలు 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లో కొంత ముందుగా మొదలవుతాయి. "ప్రాథమిక పాఠశాలల్లో చదివేది చిన్నారులైనందున వారు ఉదయం త్వరగా నిద్ర లేవరు. అందువల్ల వారికి ఉదయం 9.30 గంటలకు తరగతులకు మొదలు కావాలి. ఉన్నత పాఠశాలల్లో ఉండేది పెద్ద పిల్లలైనందున ఉదయం 9 గంటలకు మొదలుకావాలి. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా బడి సమయాలు ఉన్నాయి" అని కొందరు ప్రజాప్రతినిధులు విద్యాశాఖ దృష్టికి తెచ్చారు. అందువల్ల అన్ని పాఠశాలలను ఉదయం 9.30 లేదా 9.45 గంటలకు ప్రారంభించాలని సూచిస్తున్నారు. ఈక్రమంలో సమయాల మార్పుపై ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం.

**భిన్న వాదనలు...** పాఠశాలల సమయాలు మార్చాలంటే ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది. నిపుణులతో చర్చించి...అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో ప్రభుత్వ పాఠశాలలకు మరింత నష్టం జరుగుతుందని కొందరు సూచిస్తున్నారు. "ప్రైవేట్ పాఠశాలలు ఉదయం 7.30, 8 గంటలకే పిల్లల్ని వాహనాల్లో ఎక్కించుకొని వెళ్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు అందుకు భిన్నంగా ఆలస్యంగా ప్రారంభిస్తే విద్యార్థుల సంఖ్య మరింత తగ్గే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది తల్లిదండ్రులు ఉదయం 9 గంటల లోపే పొలం పనులకు, కూలి పనులకు వెళ్తారు. అలాంటప్పుడు ఆలస్యంగా బడులు తెరిస్తే ఇబ్బంది అవుతుంది. ఉదయం సాధ్యమైనంత త్వరగా తరగతులు మొదలైతేనే పాఠాలు బాగా అర్థమవుతాయి' అని కొందరు అభిప్రాయపడుతున్నారు. "ఉన్నత పాఠశాలలకు అనేక మంది పిల్లలు పొరుగు ఊళ్ల నుంచి వస్తారు. అందుకే అరగంట ఆలస్యంగా తెరుస్తారు. ప్రాథమిక పాఠశాలలకు పొరుగు ఊళ్ల నుంచి పిల్లలు రారు. ఈవిషయాన్ని గమనంలోకి తీసుకోవాల్సి ఉంది" అని మరికొందరు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.




హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-4 పరీక్షకు సమయం సమీపిస్తుండటంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జులై 1న జరిగే ఈ పరీక్ష కోసం హాల్‌టికెట్లను విడుదల చేశారు. జులై 1న ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్ -1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు పేపర్-2 పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. మొత్తం 8వేలకు పైగా ఉద్యోగాలకు గతేడాది నోటిఫికేషన్ జారీ చేయగా.. రాష్ట్రవ్యాప్తంగా 9.5లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com